


పట్టా..ఫట్!

- కర్నూలు సబ్ రిజిస్ట్రేషన్ అధికారుల మాయాజాలం
- పేదల డి పట్టాలే లక్ష్యం
- ఫేక్ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి లక్షలు వసూళ్లు
- బయటపడ్డ నకిలీ డాక్యుమెంట్లు
- ప్రైవేటు సైన్యం సహకారంతో ఆగడాలు
- రిజిస్ట్రేషన్ జరిగినా ఆన్‌లైన్‌లో కనిపించని పత్రాలు



బి.తాండ్రపాడులోని మంగళగిరిలో తన తండ్రికి కేటాయించిన డి.పట్టా స్థలాన్ని చూపుతున్న బాధితుడు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. గ్రామస్థాయి రెవెన్యూ అధికారుల సహకారం.., డాక్యుమెంట్ రైటర్ల.. ప్రైవేటు సైన్యం అండదండలతో సబ్ రిజిస్ట్రార్ అధికారుల ధన దాహం పరాకాష్టకు చేరింది. కర్నూలు రూరల్ పరిధిలోని విలువైన భూములు .. దళిత, బలహీన వర్గాల కోసం ప్రభుత్వాలు కేటాయించిన నివాస భూముల డీ పట్టాలను ఇష్టారాజ్యాంగా అక్రమార్కుల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. తహశీల్దార్ కార్యాలయ అధికారుల సంపూర్ణ సహకారం. డాక్యుమెంట్ రైటర్ల, ప్రైవేటు సైన్యం అండదండలతో ఏర్పడిన ముఠా ఈ వ్యాపారాన్ని బహిరంగంగా కొనసాగించడం ఆశ్చర్యాన్ని, భయాన్ని కలిగిస్తోంది. తీగ లాగితే డొంక కదిలిన చందంగా ఈ ముఠా చేస్తున్న అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. కర్నూలు మండలం బి. తాండ్రపాడులోని మంగళగిరిలో ఆర్.సి.బి1 /7466/81 1982 జనవరి 30వ తేదీన సర్వేనెంబర్ 19/1 , 336, 337 స్థలంలో 48వ ఫ్లాట్‌ను రాళ్ళపోగు పెద్దయ్య అనే దళితుడికి ఆనాటి ప్రభుత్వం కేటాయించి డి పట్టాను మంజూరు చేసింది. పెద్దయ్య కుటుంబ సభ్యులు ఆ స్థలంలో బేస్ మట్టం వేసుకొని కాంపౌండ్ వాల్ కట్టుకున్నారు. కాలక్రమంలో ఈ స్థలానికి విలువ పెరిగింది. ఈ స్థలం పై కన్నేసిన అక్రమార్కుల ముఠా రంగంలోకి దిగింది. ఆగమేఘాలపై నకిలీ పత్రాలు సృష్టించి స్థలాన్ని మార్కెట్లో అమ్మకానికి పెట్టారు. దిగువపాడు గ్రామానికి చెందిన వెంకటరెడ్డి భార్య దేవమ్మ అనే మహిళ పేరిట ఈ స్థలాన్ని అనువంశికంగా వచ్చినట్లు రిజిస్ట్రేషన్ చేయించారు. వీరి నుండి ఈ స్థలాన్ని గడివేములకు చెందిన అబ్దుల్ అజీజ్ అనే వ్యక్తి గత డిసెంబర్ 19న కొనుగోలు చేసినట్టు 19304/2022 రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ నకిలీ పత్రాలను పట్టుకొని ముఠా సభ్యులు స్థలాన్ని బేరం పెట్టారు. పదేపదే కొత్త వ్యక్తులు స్థలం దగ్గరకు వస్తుండటాన్ని గమనించిన ఇరుగుపొరుగువారు విషయాన్ని పెద్దయ్య కుటుంబ సభ్యులకు చేరవేశారు. విషయం తెలుసుకున్న వారు అవాక్కయ్యారు. సబ్ రిజిస్టర్ 2 చైతన్య రాయల్‌ను కలిసి తమ తండ్రికి 1982లో ప్రభుత్వం స్థలాన్ని కేటాయించి డి పట్టాను మంజూరు చేసిందని, తమ స్థలాన్ని అక్రమార్కుల పేర్లపై ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని నిలదీశారు. ఎలాంటి లింక్ డాక్యుమెంట్లు లేకపోయినా.. డి పట్టా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసేందుకు అవకాశం లేకపోయినా.. రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని నిలదీశారు. సబ్ రిజిస్టర్ ఏదో పొరపాటు జరిగిందని, ఈ నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలను రద్దు చేపిస్తానని సంబంధిత వ్యక్తులకు నోటీసులు పంపుతానని నమ్మబలికారు. బాధితులు దళిత వర్గానికి చెందినవారు కావడంతో నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలకు అధనంగా మరో రెండు పత్రాలను జోడించి ఆగమేఘాలపై మరొక ఎస్‌టిపై రిజిస్టేషన్ చేశారు. ప్రభుత్వ స్కూల్ టీచర్‌గా చెప్పుకుంటున్న వెంకటేష్ నాయక్ అనే వ్యక్తి రంగంలోకి దిగి స్థలం తనదేనంటూ పెద్దయ్య కుటుంబ సభ్యులు వేసిన గుడిసెను నేలమట్టం చేసి పెద్దయ్య కుటుంబ సభ్యులపై దాడికి యత్నించారు. పెద్దయ్య కుటుంబ సభ్యులు తాలూకా పోలీస్ స్టేషన్‌కి వెళ్లి తమకు రక్షణ కల్పించాల్సిందిగా ఫిర్యాదు చేశారు. 'మేము దళితులం. తహశీల్దార్ కార్యాలయ అధికారులను సంప్రదించినా ఎలాంటి సహకారం అందించడం లేదు. రిజిస్ట్రేషన్ కార్యాలయ అధికారులతో కుమ్మక్కై పేదల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి మార్కెట్లో బేరానికి పెడుతూ అక్రమంగా రూ.లక్షలు దండుకుంటున్నారు' అంటూ బాధితులు ప్రజాశక్తితో ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుపై తప్పులు చేస్తూ అధికారులు నకిలీ పత్రాలను సృష్టిస్తూ వెళ్తున్నా ఉన్నతాధికారులు నిఘా ఉంచకపోవడం శోచనీయం. ఇలాంటి మరో 19 నకిలీ పత్రాలు వెలుగులోకి రావడంతో కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి ఏ రీతిన రాజ్యమేలుతుందో తేటతెల్లమవుతోంది. ఈ వ్యవహారం ప్రధానంగా రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డ్ సీనియర్ అసిస్టెంట్ గోపాల్ రావు, జూనియర్ అసిస్టెంట్ కర్ణ నేతృత్వంలో ఈ తంతు నిరాటంకంగా సాగుతున్నట్లు అనేకమార్లు పత్రికల్లో వచ్చింది. దాదాపు పదేళ్లకు పైగా ఈ జంట అధికారులు కార్యాలయంలోనే తిష్ట వేసి కూర్చుండడం పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ అధికారుల సహకారంతో కర్నూలు సబ్ రిజిస్ట్రార్ 2 చైతన్య రాయలు, సబ్ రిజిస్ట్రార్ ప్రవీణ్, ప్రైవేట్ సైన్యం హరిబాబు, సలీం, చరణ్, షరాఫ్ గోపాల్, ప్రసాద్, దయ ఈ వ్యవహారాన్ని గుట్టుచప్పుడు కాకుండా నడుపుతున్నట్లు ఈ నకిలీ పత్రాలే సాక్ష్యం. ప్రజల సౌకర్యార్థం రిజిస్ట్రేషన్ వివరాలు పారదర్శకంగా ఉండాలని ప్రభుత్వం అందరికీ ఆన్‌లైన్‌లో కనిపించేలా అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. డాక్యుమెంట్ నెంబర్ 623/2023, 625,/2023, 638/2023, 639/2023, 654/2023, 655/2023, 656/2023 , 745/2023, 795/2023, 806/2023, 810/2023, 859/2023, 877/2023, 878/2023, 879/2023, 880/2023, 974/2023, 989/2023, 996/2023 వీటికి సంబంధించిన ఎలాంటి పత్రాలు ఆన్‌లైన్‌లో కనిపించడంలేదు. పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుని ఈ తంతు సాగించినట్లు ఈ పత్రాలే సాక్ష్యం. ఉన్నతాధికారులు ఈ తంతుపై ఎందుకు విచారణ చేపట్టడం లేదోనని బాధితులు మండిపడుతున్నారు.

సబ్‌రిజిస్ట్రార్ పొంతన లేని సమాధానం

ఈ విషయంపై సబ్‌రిజిస్ట్రార్2 చైతన్య రాయల్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా పొంతన లేని సమాధానం ఇచ్చారు. డి పట్టా లింక్ లేకుండానే రిజిస్టేషన్ చేయడం పొరపాటు జరిగింది. మా కార్యాలయం చాపల మార్కెట్‌లా మారింది. నాకు కొంత సమయం ఇవ్వండి అవతలి పార్టీని పిలిచి రిజిస్టేషన్ రద్దు చేయిస్తానన్నారు. మారో వారం రోజుల్లో కలిస్తే రిజిస్టేషన్ రద్దు చేయిస్తాను కానీ, తహశీల్దార్ కార్యాలయం నుంచి జన్యూన్ సర్టిఫికెట్ వచ్చింది. దాని ఆధారంగానే రిజిస్టేషన్ చేశాం అని బుకాయించారు. మూడు రోజుల వ్యవధిలోనే అదే డాక్యుమెంట్‌ను మరో వ్యక్తికి రిజిస్టేషన్ చేసి మరో తప్పుకు తెరతీయడం గమనార్హం.

ఫిర్యాదు వస్తే దాడులు

- పిఎఫ్ ఖాతాదారులకు నిరంతర అవగాహన
- ప్రజాశక్తితో అసిస్టెంట్ కమిషనర్ ఎ.రవీందర్



ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కార్ఖానా, ఆసుపత్రి, విద్యా సంస్థలు, పరిశ్రమలు, తదితర ఖాతాదారుల నుండి ఫిర్యాదులు వస్తే దాడులు నిర్వహిస్తాం. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మొత్తం 2065 వివిధ కంపెనీలు ఉన్నాయి. అందులో ఒక లక్ష 40 వేల ఖాతాలు ఉన్నాయి. 15వేల దాకా పెన్షనర్లు ఉన్నారు. ఆయా సంస్థలలో పని చేసే పిఎఫ్ ఖాతాదారులకు నిరంతరం సంస్థ నుంచి అందే బెనిఫిట్స్‌పై అవగాహన కల్పిస్తున్నాం. ఈనెల 27న కర్నూలు మాంటిస్సోరీ స్కూలులో అవగాహన సమావేశం ఉంటుంది.' అని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయ అసిస్టెంట్ కమిషనర్ ఎ. రవీందర్ తెలిపారు. ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన అనేక అంశాలను వివరించారు.

ఉద్యోగ ప్రస్థానం ఎక్కడి నుంచి మొదలయింది? మీ విద్యార్హత ఏమిటి?

ఎసి: ఎంబిఎ పూర్తి చేశాను. తొలుత 1999లో మధురైలో అకౌంట్స్ ఆఫీసర్ గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టాను. మధురై, వరంగల్, హైదరాబాద్, కూకట్ పల్లి చెన్నై లలో పనిచేసి బదిలీపై కర్నూలు వచ్చాను. 2017లో హైదరాబాదులో పని చేసే సందర్భంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొందాను.

పిఎఫ్ ఖాతాదారులకు పెన్షన్ ఏ తేదీ లోపల ఇస్తారు?

ఎసి: ప్రతినెల 10వ తేదీలోపు అందజేస్తాం.

పిఎఫ్ ఖాతాదారులకు ఏ విధంగా చేరువవుతున్నారు?

ఎసి: 'నిధి ఆప్కే నికట్' అనే కార్యక్రమం ద్వారా మీ ఇంటి ముంగిటికే పిఎఫ్ కార్యాలయం. అనే కార్యక్రమం ద్వారా ప్రతినెల ఒక ప్రాంతంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి ఖాతాదారుల నుండి వినతులు స్వీకరిస్తాం. కొన్ని అక్కడికక్కడే సమస్యలు పరిష్కారం చేస్తాం. మరికొన్ని కడప కార్యాలయానికి పంపి వాటి పరిష్కారానికి కృషి చేస్తాం. ఈనెల 27న మాంటిసోరి స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

ఖాతాదారుల నుండి ఎన్ని దరఖాస్తులు స్వీకరించారు? ఎన్ని పరిష్కరించారు?

ఎసి: కర్నూలు, నంద్యాల ఉభయ జిల్లాలలో 2023 జనవరి నుండి 92 దరఖాస్తులు ఖాతాదారుల నుండి స్వీకరించాం. అందులో 25 పరిష్కరించాం.

ఉభయ జిల్లాల్లో స్థాపించిన కంపెనీలు ఎన్ని? ఎన్ని ఖాతాలు ఉన్నాయి? ఎన్ని పెన్షన్లు ఉన్నాయి?

ఎసి: ఉభయ జిల్లాలలో 2065 కంపెనీలు స్థాపించబడ్డాయి. అందులో ఒక లక్ష 40 వేల ఖాతాలు ఉన్నాయి. 15వేల దాకా పెన్షనర్లు ఉన్నారు.

పిఎఫ్ ఖాతాలు తెరిచేందుకు నిబంధనలు ఏమిటి?

ఎసి: పిఎఫ్ ఖాతాలు తెరవాలంటే ఆసుపత్రి, కార్ఖానాలలో, పాఠశాలల్లో, వైద్యశాలల్లో తదితర సంస్థలలో కనీసం 20 మంది, సినిమా థియేటర్లలో కనీసం ఐదు మంది ఉంటే పిఎఫ్ సౌకర్యం కల్పిస్తాం.

పిఎఫ్ ఖాతాదారులు జీవన్ ప్రమాణ పత్రాలు ప్రతి సంవత్సరం ఏ నెల లోపు సమర్పించాలి?

ఎసి: పిఎఫ్ ఖాతాలో కలిగిన పెన్షన్ దారులు తాము జీవించి ఉన్నామని జీవన్ ప్రమాణ పత్రాన్ని నవంబరు నెలాఖరు లోపల సమర్పించాలి. మరో మూడు నెలల లోపల పిపిఒ నెంబర్ చెప్పి రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఉద్యోగి పీఎఫ్ ఖాతాదారుడు అయి అకాల మరణం చెందితే పెన్షన్ ఎవరెవరికి వస్తుంది?

ఎసి: ఉద్యోగి పిఎఫ్ ఖాతాదారుడై అకాల మరణం చెందితే సంబంధిత ఫారాలు భర్తీ చేసి పిఎఫ్ కార్యాలయానికి అందజేస్తే భార్యకు రూ.1000 చొప్పున జీవితాంతం పెన్షన్ ఇస్తాం. చిన్న పిల్లలు ఉన్నట్లయితే వారికి 25 సంవత్సరాల వయసు వరకు ఒక్కొక్కరికి రూ.450 చొప్పున ఇద్దరికీ రూ.900 ఇస్తారు.

ఉద్యోగి జీతం బేసిక్ ఎంత లోపు ఉంటే పిఎఫ్ కు అర్హుడు?

ఎసి: ఉద్యోగికి జీతం రూ 15,000 బేసిక్ లోపు ఉంటే పిఎఫ్ పొందుటకు అర్హుడు. పిఎఫ్ ఖాతాదారుడు వాటా 12 శాతం, సంస్థ వాటా 12 శాతం కలిపి ప్రభుత్వానికి సంస్థ చెల్లించాల్సి ఉంటుంది. పెన్షన్ కు 1.16శాతం కేంద్రంఇస్తుంది. 8.33శాతం పెన్షన్ కు 3.67 పిఎఫ్ కు పోతుంది. దానికి 8.1శాతం వడ్డీ జమ అవుతుంది.

పిఎఫ్ ఖాతాదారులు సమస్యల పరిష్కారానికి ఎవరిని సంప్రదించాలి?

ఎసి: పిఎఫ్ ఖాతాదారులు పిఎఫ్ కార్యాలయం లో గాని, ఫోన్. 08562 - 244902, 244189. వాట్సాప్ నెంబర్. 949 1138297. లకు కానీ సంప్రదించాలి.



ఎస్ఐ పరీక్షా కేంద్రాలను ఎస్పి తనిఖీ



పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఎస్పి సిద్ధార్థ్ కౌశల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఎస్ఐ ఉద్యోగాల భర్తీ కోసం పోలీస్ శాఖ నిర్వహిస్తున్న ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్షలను కర్నూలు జిల్లా ఎస్పి సిద్ధార్థ్ కౌశల్ ఆదివారం తనిఖీ చేశారు. కర్నూలు నగరంలోని కర్నూలు పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాల(టౌన్ మోడల్), సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసఫ్ కళాశాల , కెవిఆర్ కళాశాలల పరీక్ష కేంద్రాలను సందర్శించి, రాత పరీక్షలు జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. ఈ సంధర్భంగా ఎస్పి మీడియాతో మాట్లాడారు. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలకు ప్రిలిమినరీ రాత పరీక్షలను కట్టుదిట్టమైన భద్రతలతో నిర్వహిస్తున్నామన్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా మొత్తం 39 పరీక్ష కేంద్రాలలో 19,800 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయన్నారు. ఎస్ఐ అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు.

మానవత సంస్థ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న కలెక్టర్ సతీమణి స్వర్ణలత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మానవతా సంస్థ సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ సతీమణి స్వర్ణలత అన్నారు. ఆదివారం స్థానిక ఔడోర్ స్టేడియంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ యశోద హాస్పిటల్స్ , గచ్చేబౌలి హైదరాబాద్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్వర్ణలత రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మహిళా విభాగం అధ్యక్షురాలు యాని ప్రతాప్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మానవత సేవలు, మొక్కలు నాటడం కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనడం ప్రత్యక్షంగా చూశానని, రక్తదానం, ఉచిత వైద్య శిబిరాలు, ఫ్రీజర్ బాక్సులు, శాంతి రథాలు అంటూ భిన్న రంగాల్లో కూడా సేవలు అందించడం గొప్ప విషయమని అన్నారు. సంస్థలో మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం గొప్ప విషయమని కొనియాడారు. తాను కూడా ఈ మెడికల్ క్యాంప్ పాంప్లెట్‌ను తెలిసిన వాళ్ళందరికీ పంపానని తెలిపారు. కరోనా కష్ట కాలంలో కూడా పారిశుధ్య కార్మికులకు ఆహార సదుపాయం కల్పించడం గొప్ప విషయం అన్నారు. డిఎస్‌డిఒ రమణ మాట్లాడుతూ ఇబ్బందుల్లో వున్న వారికి మానవత సంస్థ సేవలు ఎంతో తోడ్పాటు నిస్తాయి అన్నారు. ఎపిఎస్‌పి డిఎస్‌పి భాష మాట్లాడుతూ తాను కూడా మానవతా సంస్థ సేవల్లో పాల్గొంటూ వుంటానని తెలిపారు. జిల్లా కన్వీనర్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కచ్చితమైన విధానాలతో సభ్యుల, దాతల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. యశోదా ఆసుపత్రి డాక్టర్లు సోమేష్ మంజునాథ, జితేందర్ జైన్, శ్రీకాంత్ రాజు, మేఘన, తేజశ్వనిలు పాల్గొని కార్డియాలజీ, అర్థో, జనరల్ మెడిసిన్, వ్యసికులర్, పల్మనాలజి వైద్య సేవలు, ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఐడిసి డైరెక్టర్ పాటిల్ హనుమంత్ రెడ్డి, అధ్యక్షులు శివారెడ్డి, యుగంధర్ శెట్టి,అపర్ణ,రాజు, ప్రభాకర్ హరికిషన్ బాలకష్ణ రెడ్డి, లక్ష్మి, రేష్మ,సునీల్, ప్రతాప్ పాల్గొన్నారు.



క్రమశిక్షణకు క్రీడలు ఎంతో అవసరం


క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసిన డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

చదువుతోపాటు క్రమశిక్షణ ,ఏకాగ్రత, శరీర దృఢత్వం కోసం క్రీడలు వంటి మంచి అలవాట్లు ఎంతో అవసరమని ప్రముఖగ్యాస్ట్రోఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. సిలంబం జాతీయస్థాయి పోటీలకు శ్రీ లక్ష్మీ స్కూల్ క్రీడాకారులు ఎంపికయ్యారు. వారికి క్రీడా దుస్తులను, క్రీడా సామాగ్రిని గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ బి.శంకర్‌శర్మ అందజేశారు. ఈనెల 24వ తేదీ నుంచి 27 వరకు తమిళనాడులోని రాజ్యపాల్యం ఇండోర్ స్టేడియంలో సి లంబం నేషనల్ లెవెల్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థులను డాక్టర్ బి.శంకర్‌శర్మ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సి లంబం క్రీడా ప్రాధాన్యత ఆవశ్యకతను తెలిపారు. ఈ క్రీడకు పుట్టినిల్లు భారతదేశం అవడంఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. క్రీడలు ధైర్య సాహసాలతో జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఎంతో దోహదపడుతాయని విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సిలంబం శిక్షకుడు బి రాఘవేంద్ర మహావీర్ ఠాకూర్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షేమానికి సిఎం పెద్దపీట

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన హాఫీజ్‌ఖాన్



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

సిఎం వైఎస్‌జగన్ మోహన్ రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నారని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. 4 లక్షల 60 వేల రూపాయల చెక్ లను ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ అందజేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకం ద్వారా 3వేలకు పైగా వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వం ఏదైనా వుందంటే అది వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పోతుల నాగరాజు గెలుపునకు ప్రజాసంఘాల విస్తృత ప్రచారం



ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు విజయ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలో ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్ష ముగిసిన తర్వాత నగరంలోని 38 పరీక్షా కేంద్రాల వద్ద ఎస్‌ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు, కెవిపిఎస్ జన విజ్ఞాన వేదిక, ప్రజాశక్తి ఆధ్వర్యంలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ నిరంతరం ప్రజల సమస్యల కోసం పోరాడుతున్న పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి నీతివంతమైన రాజకీయాలు ఉండాలని, ,శాసనమండలిలో ఉన్నత విద్యా వంతులు ఉండాలని కోరుతూ పోతుల నాగరాజు ముందుకు వచ్చారని చెప్పారు. ఉద్యోగాన్ని వదిలేసి శాసనమండలిలో గతంలో పోటీ చేసి చాలా తక్కువ తేడాతో ఓడిపోయారని, ప్రస్తుతం ఉపాధ్యాయ సంఘాలు యుటిఎఫ్, ఎస్‌టియు , ఎస్‌ఎఫ్ఐ, ఎఐఎస్‌ఎఫ్ లాంటి ప్రముఖమైన సంఘాలన్నీ పోతుల నాగరాజుకు మద్దతు తెలుపు తున్నా యన్నారు. పిడిఎఫ్ బలపరిచిన పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, నాగేష్, నాయకులు శంకర్, హుస్సేన్, ప్రకాష్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, నగర అధ్యక్ష కార్యదర్శులు అమర్, సాయి, ఉదయ్, అబు బాకర్, సిఐటియు నాయకులు టి రాముడు, ఎం రాజశేఖర్, విజయ్ సుధాకర్ అప్ప, ఏసన్న సాయిబాబా శ్రీనివాసులు జన విజ్ఞాన వేదిక నాయకులు తిమ్మప్ప, ప్రజాశక్తి సిబ్బంది మధు ఎలా గౌడ్, చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకులు షరీఫ్, ప్రవీణ్ రెడ్డి, ఎం.బాస్కర్.ఎస్ .రొషయ్య,ఎ .సోమన్న, బతుకన్న. కుమార్,రజక వత్తిదారుల సంఘం నాయకులు శేషాద్రి శ్రీనివాసులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు షరీఫ్, తదితరులు



ప్రచారం చేస్తున్న రజకసంఘం నాయకులు గురుశేఖర్



ప్రచారం చేస్తున్న ఐద్వా నాయకులు ఉమాదేవి

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, పొదుపు లక్ష్మీ గ్రూపుల సమన్వయ కమిటీ లక్ష్మీ నగర్‌ల ఆధ్వర్యంలో డాక్టర్స్ మైత్రి హాస్పిటల్ వారి సౌజన్యంతో ఆదివారం కర్నూలు వికాస్ హైస్కూల్‌లో టి.షడ్రక్ జ్ఞాపకార్థం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ వినోద్, డాక్టర్ శ్రీకర్, డాక్టర్ శశాంక్, డాక్టర్ షబానాలు 15 రోజులు పసిపాప నుండి 90 సంవత్సరాల ముసలి వారి వరకు 200 మందికి సుమారు రూ. 30 వేల మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిర సమావేశానికి ఎల్లాగువేరా అధ్యక్షత వహించారు. అనంతరం మైత్రి హాస్పిటల్స్ సిబ్బందికి సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, పొదుపు లక్ష్మి గ్రూపుల సమన్వయ కమిటీల పేరుతో మెమొంటోలు అందజేసి సన్మానించారు. ఈ శిబిరంలో వి. వెంకటేశ్వర్లు, శేషాద్రి, పొదుపు లక్ష్మి గ్రూపుల సమన్వయ కమిటీ ఆర్పిల సంఘం నాయకులు ఉమాదేవి, ఐక్య సంఘం నాయకురాలు సాహిరాభాను,కె.ఊర్మిళ, వి.రాధిక, శ్రీరామనగర్ నాయకులు కె.నరసింహులు, వి.జనార్ధన్, ఎస్‌ఎఫ్ఐ నాయకులు నరసింహ, కర్నూలు చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ సుశాంత్, అజ్మత్, సుంకన్న తదితరులు పాల్గొని సహాయ సహకారాలు అందించారు.



వెంకట్ శిద్దారెడ్డికి అక్షరం పురస్కారం-2023

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్



ప్రముఖకవి, కథా రచయిత కాశీభట్ల వేణుగోపాల్ స్థాపించిన అక్షరం లిటరరీ ట్రస్ట్ తొలిపురస్కారాన్ని తొలిసారిగా కథారచయిత, పబ్లిషర్ అయిన వెంకట్ శిద్దారెడ్డికి ప్రకటించారు. ఈ సంస్థను ఇటీవల కర్నూలు కేంద్రంగా అక్షరం లిటరరీ ట్రస్టు పేరుతో సాహిత్య సాంస్కృతిక సంస్థను ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో సాహిత్య రంగంలో కృషి చేస్తున్నవారికి, కవులకు, కళాకారులకు ప్రతీఏడాది అక్షరం ట్రస్టు పురస్కారాలను ఇచ్చేసంస్థగా దీన్ని స్థాపించినట్లు ట్రస్టు కార్యదర్శి ప్రముఖకవి జి.వెంకటకృష్ణ తెలిపారు. ఇందులో సాహిత్యరంగంలో విశేషంగా ఉన్న కవులు సాహిత్యాభిమానులతో ట్రస్టీ ఏర్పాటయిందన్నారు. ఈ ఏడాది అక్షరం ట్రస్టు పురస్కారం-2023 ఇస్తున్నామని తెలుగురాష్ట్రాల్లో అనిర్వచనీయ సాహిత్యసేవ చేశారన్నారు. ఈ పురస్కార ప్రదానం కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సమావేశ హాలు లోఈనెల 26న ఆదివారం ఉ.10.30 గంటలకు చేయనున్నామని పురస్కారం సందర్భంగా రూ.25వేల నగదు, మెమొంటోతో సత్కరిస్తారమన్నారు.

22న పిడిఎఫ్ అభ్యర్థుల నామినేషన్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు , ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గాలకు పిడిఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు డాక్టర్ పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డి ఈనెల 22న నామినేషన్ వేయనున్నారు. ఉపాధ్యాయ కార్మిక విద్యార్థి యువజన ప్రజాసంఘాల మద్దతుతో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పోతుల నాగరాజు, కత్తి నర్సింహారెడ్డి అభ్యర్థులుగా తమ నామినేషన్ పత్రాలను 22న అనంతపురంలో జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించనున్నారు. అనంతపురంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజ్ నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీతో పిడిఎఫ్ ఎమ్మెల్సీఅభ్యర్థులు నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలతోపాటు యుటిఎఫ్, ఎస్‌టియు, సిఐటియు, ఎఐటియుసి, ఎస్‌ఎఫ్ఐ, ఎఐఎస్‌ఎఫ్, డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్ లతోపాటు ఇతర ఉపాధ్యాయ బిసి సంఘాల నాయకులు హాజరుకానున్నారు. ఈ నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలు పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా నుండి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, పట్టభద్రులు పాల్గొనాలని కోరారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సబ్ ఇన్‌స్పెక్టర్ అర్హత పరీక్ష ముగించుకొని వెళ్తున్న గ్రాడ్యుయేట్స్‌కు ప్రజాసంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నారాయణ కాలేజీ, డిగ్రీ కాలేజీ సెంటర్స్ వద్ద కరపత్రాల పంపిణి చేశారు. శంకరస్ డిగ్రీ కాలేజీ వద్ద సోషల్ మీడియా నాయకులు ఎల్లగువేర, సిఐటియు నాయకులు ఉమాదేవి, రజకసంఘం నాయకురాలు జయమ్మ, సిఐటియు నాయకులు వి.వెంకటేశ్వర్లు, నారాయణ కాలేజీ సెంటర్ వద్ద రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురుశేఖర్, నగర అధ్యక్ష కార్యదర్శుల, రాముడు, శేషాద్రి,శ్రీనివాసులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న నాయకులు

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పిఎఫ్, ఏపి జిఎల్ఐసి, సరెండర్ లీవ్స్, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన అన్ని రకాల ఆర్థిక పరమైన చెల్లింపులు చేయాలని యుటీఎఫ్ సీనియర్ నాయకులు పాపయ్య, దావీదు డిమాండ్ చేశారు. ఆదివారం పురపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. నూతన ఉపాధ్యాయులకు సంబంధించి సిపిఎస్, జిపిఎస్ తప్ప పాత పెన్సన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. అనంతరం యుటీఎఫ్ ఆదోని మండల నూతన కమిటీ గౌరవాధ్యక్షులుగా పిసిహెచ్ పెద్దయ్య, అధ్యక్షులుగా వై .రామాంజనేయులు, సహాధ్యక్షులుగా హెచ్ సుధాకర్, హెచ్ఎం వీరశ్రీ, ప్రధాన కార్యదర్శిగా యస్ రాజహుషేన్‌బి, ట్రెజరర్‌గా లినాగేంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅథితులుగా జిల్లా కార్యదర్శి దేవపాల్, జిల్లా సహా అధ్యక్షులు జీవిత, జిల్లా కార్యదర్శి గాదిలింగప్ప, ఐ కృష్ణమూర్తి, ఎన్నికల అధికారిగా దావీదు, ఎన్నికల పరిశీల కులుగా పి.నాగలక్ష్మి వ్యవహరించారు. నాయకులు భోజరాజు, మల్లయ్య, పెద్దయ్య, నర్సయ్యగౌడ్, శివకుమారు గౌడ్, శ్రీకాంత్, సుధాకర్, జనార్దన్ నారాయణ, బసప్ప, జంభులింగయ్య, భాగ్యలక్ష్మి, లాలమ్మ పాల్గొన్నారు.

రైల్వే ఆస్తులను కాపాడడం హక్కు

- వైసిపి మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ
- గ్రామాల్లో రైల్వే శాఖపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - చిప్పగిరి

రైల్వే శాఖకు సంబంధించి ఆస్తులను కాపాడడం మన హక్కు అని వైసీపీ మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని గుమ్మ నూరు, బంతనహాల్, కాజీపురం, కొట్టాల గ్రామాలలో గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి, వైసీపీ మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ సహకారంతో పలు గ్రామాలలో ఆర్పిఎఫ్ అధికారులు రైల్వే శాఖపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల కాలంలో రైలుపై రాళ్లురువిన సంఘటన జరగడం వల్ల, ట్రాక్ పక్కనే ఉన్న గ్రామాలలో ప్రజలకు ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు చేయడం వల్ల కలిగే ఇబ్బందులను ఏఎస్ఐ పిఎఫ్ కె.రవిశంకర్ రావు, ఏఎస్ఐ పిడి సి.హెచ్. శ్రీనివాసరావులు వివరించారు. అదేవిధంగా ప్రజలు ఆప్యాయంగా పెంచుకునే జంతువులను రైల్వే ట్రాక్‌పై వదలకూడదని అన్నారు. ప్రజలు రైల్లో ప్రయాణం చేసేటప్పుడు టికెట్ లేకుండా ప్రయాణం చేయడం వల్ల శిక్ష అర్హులు అవుతారని తెలిపారు. అనంతరం గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించుటకు సహకరించిన వైసీపీ మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణకు ఆర్పిఎఫ్ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మనూరు శ్రీధర్,అజయ్, చంద్రయ్య, నారి, సంగమేశ్వర తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రైల్వే అధికారులు

శివపార్వతుల విగ్రహాల ఊరేగింపు

ప్రజాశక్తి - దేవనకొండ

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన దేవనకొండలో ఆదివారం శంకర దేవాలయంలో శివ స్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతుల విగ్రహా లకు, బసవేశ్వర నకు ప్రత్యేక అలంకరణ చేసి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.



విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

ప్రజాశక్తి - ఆదోని రూరల్

పట్టణంలో బ్రిటీష్ పాలకుల హయాంలో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయ భవనాలు శిథిలమై నేల కూలటానికి సిద్ధంగా ఉన్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని కార్యాలయాల ఉద్యోగులు, సిబ్బంది తమ ప్రాణాలను సైతం అరిచేతిలో పెట్టుకొని విధులు నిర్వహిస్తున్నారు. ఆదోని పట్టణంలో తహసిల్దార్, మైనర్ ఇరిగేషన్, ఆర్ అండ్ బి ఏఈ, డిఇ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థలో వ్యవస్థకు చేరుకున్నాయి. వర్షాకాలంలో ప్రభుత్వ కార్యాలయాల పైకప్పు పూర్తిగా దెబ్బతిని వర్షం కురుస్తుంది. దీంతో కార్యాలయంలోని విలువైన రికార్డులు తడిసి పాడవుతున్నాయి. బ్రిటీష్ పాలకుల హయాంలో నిర్మించిన



ఆదోని తహసిల్దార్ కార్యాలయం

మైనర్ ఇరిగేషన్,ఆర్అండ్బి ఏఈ,డిఇ కార్యాలయంపై కప్పు పెంకులు దెబ్బ తినడంతో ఎప్పటికప్పుడు తాత్కాలికంగా మరమ్మత్తులు చేస్తున్న ప్రయో జనం లేదు. వర్షానికి కార్యాలయం స్లాబ్ పెచ్చులు ఊడిపోతూ ఇనుప చువ్వలు తుప్పుపట్టి స్లాబు అచ్చులు ఊడి సిబ్బందిపై పడుతున్నాయి. పట్టణం, మండలంలోని వివిధ శాఖల ప్రభుత్వ కార్యాలయాల భవనాలు కూడా పూర్తిగా మరమ్మతులు చేరుకుని శిథిలావస్థకు చేరాయి. దశాబ్దాలు గడుస్తున్న ఇప్పటివరకు సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణం పనులు, మరమ్మతులు చేపట్టాలని ఆలోచన చేయకపోవడంపై స్థానిక ప్రజలు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అనుమతుల్లేని దంత వైద్యశాలలు గుర్తింపు

ఏపీ స్టేట్ డెంటల్ కౌన్సిల్ ఏథికల్ కమిటీ

ప్రజాశక్తి - ఆదోని రూరల్

పట్టణంలో అనుమతులు, అర్హతలు లేని వైద్య సేవలు అందిస్తున్న మూడు దంత వైద్య శాలలను గుర్తించినట్లు ఏపీ స్టేట్ డెంటల్ కౌన్సిల్ ఏథికల్ కమిటీ సభ్యుడు డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఓ ప్రైవేటు క్లినిక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికంగా అనుమతుల్లేకుండా వైద్య సేవలు అందిస్తున్నారన్న ఫిర్యాదుతో ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు. మొత్తం 16 దంత వైద్యశాలలను పరిశీలించగా వాటిలో మూడింటికి కనీస అనుమతులు లేవన్నారు. ఇందులో ఎలాంటి వైద్య అర్హతలు లేకుండానే వైద్యులు దంత వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. దీనిపై స్టేట్ డెంటల్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉంటూ గుర్తింపు పొందిన వైద్యుల దగ్గరే సేవలు పొందాలని సూచించారు. ఆయన వెంట డెంటిస్ట్ సర్జన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంతోష్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేశ్ గాధాం, కర్నూలు జిల్లా ఇన్‌ఛార్జి రాజశేఖర్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏపీ స్టేట్ డెంటల్ కౌన్సిల్ ఏథికల్ కమిటీ సభ్యులు

నైతిక విలువలతో జీవించాలి : కదిరికోట ఆదెన్న

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రతి మనిషి మానవత, నైతికత అనే విలువలతో జీవించాలని అప్పుడే మానవ జీవితానికి సార్థకం అవుతుందని టిడిపి నేత కదిరికోట ఆదెన్న, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జి. అల్తాఫ్ లు పేర్కొన్నారు. ఆదివారం జమా అతే ఇస్లామి హింద్ కర్నూలు జిల్లా అధ్యక్షులు చాంద్ భాషా ఆధ్వర్యంలో మానవత, నైతికత అనే అంశంపై చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఉద్యమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత్వం అంటే తోటి వారి పట్ల దయ, జాలి, సానుభూతి చూపించడం, కుల మతాలకు అతీతంగా మనషులందరినీ ప్రేమించడమేనన్నారు. చెడును అసహ్యించుకోవడం, మంచిని పెంపొందించడమే నైతికతని స్పష్టం చేశారు. కానీ నేటి కేంద్ర, రాష్ట్రపాలకులు మానవత్వాన్ని మరిచి భారత రాజ్యాంగాన్ని ధిక్కరించి రాక్షస పాలన, రాచరిక పాలన కొనసాగించడం దురదృష్టకరమని ఆవేదన చెందారు. మానవత, నైతికత ను మానవుల్లో చైతన్యం తీసుకురావడానికి జమ అతే ఇస్లామీ హింద్ సంస్థ చేపట్టిన ఉద్యమం పట్ల వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో జమా అతే ఇస్లామీ హింద్ సభ్యులు మూసా, ఇస్మాయిల్, లాల్ కోట్ ఖదీర్, పరశురాం, మహేష్, పట్టణ టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు కె.యం.డి. అబ్దుల్, ఆఫ్గాన్ వలి భాష తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఘనంగా చత్రపతి శివాజి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - కోసిగి రూరల్

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను కోసిగిలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక సిద్ధారూఢ శాంతాశ్రమంలో కోసిగి పట్టణ యూత్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహన్ని ఏర్పాటు చేశారు. ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలకు ముఖ్య అతిధులుగా వైసీపీ మండల ఇంచార్జ్ మురళీమోహన్ రెడ్డి, బెట్టనగౌడ్, నాడిగేని నరసింహులు, ఈరన్న, నాగరాజు, మాంతేష్ స్వామి హజరైయారు. అనంతరం ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు పూజలు చేసి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా వైసిపి మండల ఇంచార్జ్ మురళీమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ జీవితం యువతకు స్ఫూర్తిదాయకం అన్నారు. ఛత్రపతి శివాజీ తన 17వ సంవత్సరంలోనే యుద్ధ పోరాటలపై పూర్తిగా నైపుణ్యం సాధించి, అప్పటి మొగల్ చక్రవర్తుల అరాచక పాలనను ఎదుర్కొని, వెన్నుచూపని ఏకైక వీరుడని, తన పాలనలో హిందూమత ప్రాచుర్యం కొసం పోరాడిన యోధుడు శివాజీ మహారాజ్ అని వారు కొనియాడారు. అనంతరం ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యదర్శి రాఘునాత్ జీ మాట్లాడారు. శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని సాయంత్రం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహము శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు హొలగుంద కోసిగయ్య, బుల్లి నరసింహులు, ముకంద కిష్టప్ప, ముకంద నరసరెడ్డి, అంజి, నాగరాజు శివాజీ మహారాజ్ ఉత్సవ కమిటీ సభ్యులు వేంకటేశ్, బసవరాజు, హొటల్ రమేష్, డ్రైవర్ లక్ష్మన్న, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు. **ఆదోని:** ఆదోని పట్టణంలోని, ఫారెస్ట్ లైన్ - అంబాభవాని దేవాలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం చత్రపతి శివాజీ మహారాజ్ విగ్ర ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. పట్టణంలో సాయంత్రం శోభయాత్ర నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు.

బోయ ఈరప్ప మృతి పార్టీకి తీరని లోటు

పజాశక్తి - కౌతాళం

తెలుగుదేశం పార్టీ కార్యకర్త బోయ ఈరప్ప మృతి పార్టీకి తీరని లోటని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉలిగయ్య, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం గుడికం బాలి గ్రామంలో వీరప్ప మృతి చెందిన విషయం తెలియడంతో ఆయన ఆర్థిక దేహానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం ఎల్లప్పుడూ కష్టపడి పనిచేసే, పార్టీ అబివృద్ధికి కృషి చేయడం జరిగిందన్నారు. ఇలాంటి కార్యకర్త మృతి చెందడం ఎంతో కలిసివేసిందన్నారు. ఈయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



తారకరత్న పార్థివదేహానికి నివాళ్లు అర్పిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి

మిత్రుడిని కోల్పోవడం బాధాకరం

- తారకరత్న పార్థివదేహానికి తిక్కారెడ్డి నివాళి

ప్రజాశక్తి - మంత్రాలయం

స్వర్గీయ నందమూరి తారక రామారావు మనవడు సినీ నటులు తెలుగు దేశం పార్టీ నాయకులు స్వర్గీయ తారకరత్న వంటి మంచి మిత్రుడ్ని కోల్పోవడం బాధాకరమని టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని మోకిలలో తారకరత్న స్వగృహంలో తారక్ రత్న పార్థివదేహానికి పూలమాలతో ఆయన చిత్రపటానికి పుష్పాంజాలితో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులకు సమాచారం అందించారు. తారకరత్న హీరోగా సర్పంచ్ అనే పేరుతో సినిమా తీయాలని, అందుకు నేనే నిర్మాతగా చేయాలని అంగీకరించానని తెలిపారు. ఈ. విషయం పై నందమూరి బాలకృష్ణ గారితో కూడా మాట్లాడ జరిగిందని ఆయన కూడా చాలా సంతోషం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఇంతలోనే ఇంతటి ఘోర విషాదం జరిగిందని చెప్పారు. అనంతరం అక్కడికి చేరుకున్న ఆయన తారక్ రత్న సోదరుడు చైతన్య కృష్ణ, ప్రముఖ సినీడైరెక్టర్ జితేంద్ర, తారకరత్న చిన్న మామ అయిన రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి లను కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఇలాంటి వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమని ఆయన ఆత్మకు శాంతి కలగాలని, భగవంతుడు కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యం ఇవ్వాలని కోరుకుంటూ నివాళులు అర్పించారు.

దీపాలు వెలిగించి నివాళి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద బాలకఅప్ప అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి మిస్ యు తారకన్న అని దీపాలు వెలిగించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షులు సజ్జాద్ హుస్సేన్ మాట్లాడుతూ తారకరత్న మృతి యావత్ నందమూరి అభిమానులకు, తెలుగుదేశం పార్టీకి తీరని లోటని అన్నారు. అయన కుటుంబ సభ్యులకు ఆదోని బాలకఅప్ప అభిమానుల తరుపున ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ అభిమానులు జైరాం, ఓబ్లేష్, శంకర్ శాస్త్రి, ఖాజా, స్వామి, గురు, శీనా, గౌడ్, బ్రమ్మ, మార్కొండి, వెంకటేష్, విజయ్, ఫారిసా, ఖాసీం, రాందాస్, సోంశేఖర్, అర్జున్ పాల్గొన్నారు.



దీపాలతో తారకరత్నకు నివాళ్లు అర్పిస్తున్న

పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరచాలి

ప్రజాశక్తి - ఆదోని రూరల్

విద్యార్థులు పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని శ్రీరామదేవర, శ్రీకాశీ విశ్వనాథ, శ్రీఆంజనేయ స్వామి దేవస్థానం ఆలయ ధర్మకర్త ఆదినారాయణ అన్నారు. మండలం పరిధిలో పెద్దహరివాణం గ్రామంలో శ్రీరామదేవర, శ్రీకాశీ విశ్వనాథ,శ్రీఆంజనేయ స్వామి 16వ రథోత్సవం పురస్కరించుకొని గ్రామవాసి శ్రీచిదానంద అవధూత వారి జీవిత ఆశయంపై గ్రామ విద్యార్థులకు పోటీ పరీక్షల నిర్వహించారు. ఈ పరీక్షలకు సుమారుగా గ్రామ విద్యార్థులు 86 మంది పాల్గొన్నట్లు నిర్వాకులు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు రాము,విజేత టాలెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించారు. విఆర్వో మార్లబండి రంగస్వామి ఈ పరీక్షల ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ బహుమతి రూ.1100, ద్వితీయ బహుమతి రూ.700, తృతీయ బహుమతి రూ.500 రూపాయలు తానే స్వయంగా అందించారు. ఈ కార్యక్రమంలో విజేత టాలెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రధానోపాధ్యాయులు పరమేష్, ఉపాధ్యా యులు రవి,పవన్,వీరెష, ఉమాదేవి, రమాదేవీ, గ్రామస్తులు పాండురంగ రెడ్డి, సుంకప్ప, అల్లప్ప, ఎంకప్ప పాల్గొన్నారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అశేష జనవాహిని మధ్య శివలింగారుడ స్వామి రథోత్సవం

ప్రజాశక్తి - చిప్పగిరి

మండల పరిధిలోని కుందన గుర్తి గ్రామంలో వెలిసిన శివలిం గారుడా రథోత్సవం ఆదివారం సర్పంచ్ కొండా పురుషోత్తం, ఆలయ కమిటీ సభ్యులు శ్రీరాములు, ఆనంద్, అశోక్, శ్రీరామ్ రెడ్డి ఆధ్వర్యంలో అశేష జనవాహిని మధ్య ఘనంగా నిర్వహించారు. వేద పండితులు సమక్షంలో మహాశివరాత్రి పర్వదినాన స్వామివారికి ప్రీతిపాత్రమైన పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం స్వామివార్ల ప్రతిమలను రథోత్సవంలో అధిష్టించి అశేష జనవాహిని మధ్య రథోత్సవం నిర్వహించారు. గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ కొండా శేఖర్, కొండ నెట్టప్ప, హేమాంజ నేయులు, రామాంజ నేయులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్ఐ నజీర్ అహ్మద్ పోలీస్ చంద్ర బందోబస్తు నిర్వహించారు.



విఐపిలతో పాటు సామాన్య భక్తులకు శీఘ్ర దర్శనం


ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని గురు వైభవోత్సవాలకు విచ్చేయు వివిఐపి, విఐపి, భక్తులకు, సామాన్య భక్తులకు శీగ్ర దర్శనం ఉంటుందని శ్రీ మఠం ఏఏఓ మాధవ్ శెట్టి మేనేజర్లు యస్కే శ్రీనివాసరావు వెంకటేష జ్యోషి లు తెలిపారు. ఆదివారం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆదేశాలతో పరిపాలనా కార్యాలయంలోని ప్రముఖ సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21 వ తేదీ నుండి 26 తేదీ వరకు వరకు జరిగే శ్రీ రాఘవేంద్ర గురు వైభవోత్సవాలకు పుణ్యక్షేత్రాన్ని సందర్శించే వివిఐపి లు, విఐపి లు ఉన్నతాధి కారుల సంరక్షణ కోసం సంబంధిత ప్రోటోకాల్ నియమిం చబడిన సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతిఆచార్ అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి సిఆర్వోలు విజయీంద్రాచార్ రవికుల్కర్ణి, సహాయక పిఆర్వో హొన్నొళ్ళి వ్యాసరాజాచార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గళమెత్తే ఎమ్మెల్సీలను ఎన్నుకుందాం

ప్రజాశక్తి - ఆదోని

నిరుద్యోగ, ప్రజా సమస్యలపై శాసన మండలిలో గళమెత్తే వారిని ఎన్నుకుందామని సీఐటీయు నాయకులు లక్ష్మన్న, తిప్పన్న, డివైఎఫ్ఐ నాయకులు వీరేష్ కోరారు. ఆదివారం పశ్చిమ రాయలసీమ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్య త ఓటు వేసి గెలిపించాలని కోరుతూ పట్టణంలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. నిరంతరం ప్రజల సమస్యల మీద పనిచేస్తున్న పిడిఎఫ్, యుటిఎఫ్, ఎస్టీయు, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డివెఎఫ్ఐ, ఏఐవైఎఫ్, సిఐటియు, ఏఐటియుసి, బీసీ సంఘాలు, రిజర్వేషన్ల పోరాట సమితి బలపరుస్తున్న పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు, పశ్చిమ రాయలసీమ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.



కరపత్రాలతో ఎన్నికల ప్రచారం నిర్వహించిన నాయకులు



కబడ్డీ విజేతకు మొదటి బహుమతి అందజేస్తున్న ఉప్పలపాటి అర్జున్

కబడ్డీ విజేత చిన్న భూంపల్లి జట్టు

ప్రజాశక్తి - కోసిగి రూరల్

మహాశివరాత్రి సందర్భంగా మండ లంలోని కోలమాన్ పేట గ్రామంలో ఓపెన్ కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఆదివారం ఫైనల్ మ్యాచ్ చిన్న భూంపల్లి జట్టు మరియు కోలమాన్ పేట జట్టుల మధ్య హెూరా హెూరీగా సాగింది. ఫైనల్ మ్యాచ్‌లో కోలమాన్ పేట జట్టుపై చిన్న భూంపల్లి జట్టు విజేతగా నిలిచింది. ఓపెన్ కబ్బడి పోటీల్లో గెలుపొందిన చిన్న భూంపల్లి జట్టుకు గ్రామానికి చెందిన యువ నాయకుడు ఉప్పలపాటి అర్జున్ మొదటి బహుమతి పదివేల రూపాయలు అందజేశారు.

రన్నర్స్‌గా నిలిచిన కోలమాన్ పేట జట్టుకు రెండవ బహుమతి దాశరథి కిరణ్ కుమార్ ఏడు వేల రూపాయలు అందజేశారు. అనంతరం యువ నాయకుడు అర్జున్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందజేస్తామని క్రీడాకారులు క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు క్రీడాకారులు పాల్గొన్నారు.

తారకరత్నకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి రాష్ట్ర నాయకుడు, ప్రముఖ హీరో నందమూరి తారకరత్న మృతి పార్టీకి తీరని లోటని ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మాదిరే భాస్కర్ రెడ్డి, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, బసాపురం రామస్వామి, టిడిపి మైనర్టీ నాయకుడు సౌదీ రఫూఫ్, వడ్డెమన్ గోపాల్, మాజీ కౌన్సిలర్ రామచంద్ర, సోమ శేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆదోనిలోని కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులరించారు. ఈ కార్యక్రమంలో రాముడు, గిరిధర్, రామకఅప్ప, పకిరప్ప, శ్రీనివాస్, చాకలి నాగరాజు, తిమప, లింగయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో తారకరత్న చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి మాట్లాడుతూ తారకరత్న ఇకలేరన్న మాట దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. కల్మషంలేని మంచి వ్యక్తిత్వం కలిగిన మనసున్న వ్యక్తి తారకరత్న అన్నారు. 23 రోజులపాటు మఅత్యువుతో పోరాడిన తారకరత్న మత్యుంజయుడుగా తిరిగి వస్తారనుకు న్నామన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుకుంటు న్నారని అన్నారు. నాయకులు బాబులు, బుద్ధారెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకటేష్, కృష్ణారెడ్డి, అంజనమ్మ, శాంతి, కుమారి, శంకర్, వెంకన్న, తిమ్మప్ప, మల్లికార్జున, మహేష్, తాయన్న, రాజు, వీరేష్, పర్ష, చిట్టిబాబు, ఈరన్న, నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

దేవనకొండ : నందమూరి తారక రత్న ఆత్మకు శాంతి చేకూరాలని దేవనకొండ తెలుగుదేశం పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఆదివారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తారకరత్న మరణం తెలుగుదేశం పార్టీకి, సినీ రంగానికి తీరని లోటని నాయకులు అభిప్రాయపడ్డారు.. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, ఉచ్చిరప్ప, రామారావు నాయుడు, మల్లయ్య, సర్పంచ్ భాస్కర్, ఎంపీటీసీ తిమ్మప్ప, పొట్లపాడు వెంకటేష్,మల్లికార్జున్ గౌడ్, మాల బండ్లయ్య, వెంకట స్వామి గౌడ్, డీలర్ బండ్లయ్య, రాజశేఖర్ గౌడ్, నాగరాజు గౌడ్, చాంద్ భాషా, తెలుగు యువత నాయకులు రాజా సాహెబ్, రామంజిని తదితరులు పాల్గొన్నారు.



తారకరత్న చిత్రపటానికి నివాళి అర్పించిన భూపాల్ చౌదరి



దేవకొండలో..

IN THE COURT OF THE 1 st ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: ADONI
O.S. 8 / 2022

Between
Ediga Ramamurthy & another. ...Plaintiff
And
C.Ramesh & 3 others. …Defendants

SUMMONS TO DEFENDANTS 1 & 4

1.C.Ramesh S/o C.Sreenivasa Rao, aged about 42 years, R/o H.No.15/447, Victoria Peta, Adoni Town & Mandal, Kurnool District. (Defendant No.1)
2.C.Balaji S/o C.Sreenivasa Rao, aged about 60 years, R/o H.No.15/447, Victoria Peta, Adoni Town & Mandal, Kurnool District. (Defendant No.4)

Whereas the above named Plaintiffs have filed the above suit for Specific Performance against the defendants (for executing a regular Registered Sale Deed in favour of the plaintiffs) in respect of the plaint schedule property.You are hereby directed to appear before this Hon'ble Court in person or through an Advocate on 01/03/2023 at 10.30 A.M., failing which, the matter will be heard and decided in your absence.

SCHEDULE
Sy.No.157, an extent of Ac.9.82 cents, Kapati Village, Adoni Mandal, Kurnool District.

BOUNDARIES
East: Land of Kondla Chinna Anjanaiah
West: Land of Allappa
North: Eenam Land of Anjaneya Swamy
South: Land of Arikeri Maraiah

J.Chandra Mohan Goud,
D.Nagendra,
Advocates for the Plaintiffs,
Adoni-518 301.





మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

వైభవంగా మల్లన్న రథోత్సవం

- కమనీయంగా తెప్పోత్సవం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలంలో జరుగుతున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి అమ్మవార్ల రథోత్సవం అంగరంగ వైభవంగా, కమనీయంగా సాగింది. రాత్రి 8 గంటలకు పుష్కరిణి వద్ద తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. అంతకుముందు ఉదయం స్వామి అమ్మ వార్లకు విశేషపూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాల మధ్య తీసుకువచ్చి రథంపై ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంకాలం 4 గంటలకు రథాంగ దేవతా పూజ, హోమం, బలి సమర్పణ నిర్వహించారు. 5 గంటలకు పురవీధుల్లో స్వామిఅమ్మవార్ల రథోత్సవంలో పలు సాంప్రదాయ జానపద కళా రూపాల ప్రదర్శనల మధ్య రథశాల వద్ద నుండి నంది గుడి వరకు, తిరిగి రథశాల వద్ద వరకు అంగరంగ వైభవంగా రథోత్సవాన్ని నిర్వహించారు. రథోత్సవంలో వేలాది మధ్య భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి 8 గంటలకు పుష్కరిణి వద్ద తెప్పోత్సవ కార్యక్రమంలో స్వామి అమ్మ వార్ల ఉత్సవ మూర్తులను ఆలయం నుండి మంగళ వాయి ద్యాలతో తీసుకువచ్చి తెప్పోత్సవంలో ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



రథోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులు

నేడు రాష్ట్ర గవర్నర్ శ్రీశైలం రాక

- పర్యటనకు ఏర్పాట్లు సిద్ధం చేయండి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - శ్రీశైలం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ బిశ్వ భూషణ్ హరి చందన్ నేడు సోమవారం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దర్శనార్థం శ్రీశైలం విచ్చేస్తున్న సందర్భంగా పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం శ్రీశైలం దేవస్థానంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ సమావేశ మందిరంలో రాష్ట్ర గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతిలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ రాక సందర్భంగా సున్నిపెంట హెలిప్యాడ్ మైదానాన్ని సిద్ధం చేసి చుట్టూ బ్యారికేడింగ్ ఏర్పాటు చేయడంతో పాటు వాటర్ స్ప్రింక్లింగ్ చేయాలని ఆర్అండ్‌బి, అగ్నిమాపకశాఖ అధికారులను ఆదేశించారు. కాన్వాయ్ వెంట 15 వాహనాలను ఏర్పాటు చేయాలని జిల్లా రవాణా అధికారులను ఆదేశించారు. భ్రమరాంబ అతిథి గృహంలో ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్ర గవర్నర్‌కు వసతి, అల్పాహారం, తేనీరు, భోజనం తదితర ఏర్పాట్లు చేయాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారికి సూచించారు. కాన్వాయ్ వెంట, దేవస్థాన పరిధిలో అగ్నిమాపక వాహనాలు, సిబ్బందితో సహ సిద్ధంగా ఉంచుకోవాలని అగ్నిమాపక సిబ్బందిని ఆదేశించారు. హెలిప్యాడ్ సమీపంలో మెడికల్ క్యాంప్, అంబులెన్స్, కార్డియాలజిస్ట్‌తో పాటు నైపుణ్యం గల డాక్టర్లను అందుబాటులో ఉంచుకోవాలని డిఎంఅండ్‌హెచ్ఒ, డిసిహెచ్ఎస్, నంద్యాల సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి డ్యూటీ పాసులు మంజూరు చేయాలని ఆర్‌డిఒ ఎం.దాసుకు సూచించారు. రాష్ట్ర గవర్నరు పర్యటించే ప్రదేశాలలో పారిశుధ్య పనులు చేపట్టాలని డిపిఒను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హెలిప్యాడ్ సమీపంలో ప్రముఖులకు తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. కాన్వాయ్‌లో ఉన్న వాహనాలకు, డ్యూటీ అధికారులకు ఆహార పదార్థాల పాకెట్లను అందజేయాలని సివిల్ సప్లై అధికారులకు సూచించారు. దేవస్థానంలో సంప్రదాయాన్ని అనుసరించి రాష్ట్ర గవర్నర్‌కు భ్రమరాంబామల్లికార్జున స్వామి వార్ల దర్శనాలను శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని ఇఒను ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్ఒ పుల్లయ్య, ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారిచక్రపాణిరెడ్డి, ఇఒ ఎస్.లవన్న, ఆత్మకూరు ఆర్డీఒ ఎం.దాసు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పి

నేడు రాష్ట్ర గవర్నర్ బిశ్వ భూషణ్ హరి చందన్ శ్రీశైల పర్యటన సందర్భంగా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, జిల్లా ఎస్పి కె. రఘువీర్ రెడ్డిలు పరిశీలించారు. సున్నిపెంట హెలిప్యాడ్ మైదానాన్ని పరిశీలించారు. సున్నిపెంట్ హెలిప్యాడ్ మైదానం నుండి మాక్ ట్రయల్ రన్ నిర్వహిస్తూ మార్గమధ్యలో పారిశుధ్య చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజల కార్యక్రమాలపై ఇఒతో చర్చించారు. ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, గవర్నర్ ప్రొటోకాల్ అధికారి ఉదయరాజు, దేవస్థానం ఇఒ ఎస్.లవన్న, ఆత్మకూరు ఆర్‌డిఒ ఎం.దాసు, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ సుబ్బారెడ్డి, డిఆర్‌డిఏ పీడి శ్రీధరరెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు గవర్నర్ విశ్వ భూషణ్ పర్యటన వివరాలు..

రాష్ట్ర గవర్నర్ విశ్వ భూషణ్ హరి చందన్ నేడు భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని దర్శించుకునేందుకు ఉదయం 8 గంటలకు రాజ్ భవన్ నుండి బయలుదేరి 8:20 నిమిషాలకు గన్నవరం ఎయిర్ పోర్ట్‌కు చేరుకుంటారు. 9:40 నిమిషాలకు సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 9:50 నిమిషాలకు సున్నిపెంట హెలిప్యాడ్ నుండి బయలుదేరి 10:10 నిమిషాలకు రోడ్డు మార్గం ద్వారా శ్రీశైలంలోని భ్రమరాంబ అతిథి గృహానికి చేరుకుంటారు. 10:25 నిమిషాల నుండి 11 గంటల వరకు క్షేత్రంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వాళ్ళను దర్శించుకుని తిరిగి భ్రమరాంబ అతిథి గృహానికి చేరుకుంటారు. 11:40 నిమిషాలకు భ్రమరాంబ అతిథి గృహం నుండి బయలుదేరి రోడ్డు మార్గం ద్వారా సుండిపెంట హెలిప్యాడ్‌కు 12 గంటలకు చేరుకుంటారు. 12:10 నిమిషాలకు హెలిప్యాడ్ నుండి బయలుదేరి గన్నవరం ఎయిర్ పోర్ట్ చేరుకొని అక్కడి నుండి 1:50 నిమిషాలకు రాజ్ భవన్ చేరుకుంటారు.

ఫిర్యాదు వస్తే దాడులు

- పిఎఫ్ ఖాతాదారులకు నిరంతర అవగాహన
- ప్రజాశక్తితో అసిస్టెంట్ కమిషనర్ ఎ.రవీందర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కార్ఖానా, ఆసుపత్రి, విద్యా సంస్థలు, పరిశ్రమలు, తదితర ఖాతాదారుల నుండి ఫిర్యాదులు వస్తే దాడులు నిర్వహిస్తాం. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మొత్తం 2065 వివిధ కంపెనీలు ఉన్నాయి. అందులో ఒక లక్ష 40 వేల ఖాతాలు ఉన్నాయి. 15వేల దాకా పెన్షనర్లు ఉన్నారు. ఆయా సంస్థలలో పని చేసే పిఎఫ్ ఖాతాదారులకు నిరంతరం సంస్థ నుంచి అందే బెనిఫిట్స్‌పై అవగాహన కల్పిస్తున్నాం. ఈనెల 27న కర్నూలు మాంటిస్సోరీ స్కూలులో అవగాహన సమావేశం ఉంటుంది.' అని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయ అసిస్టెంట్ కమిషనర్ ఎ. రవీందర్ తెలిపారు. ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన అనేక అంశాలను వివరించారు.

ఉద్యోగ ప్రస్థానం ఎక్కడి నుంచి మొదలయింది? మీ విద్యార్హత ఏమిటి?

ఎసి: ఎంబిఎ పూర్తి చేశాను. తొలుత 1999లో మధురైలో అకౌంట్స్ ఆఫీసర్ గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టాను. మధురై, వరంగల్, హైదరాబాద్, కూకట్‌పల్లి చెన్నై లలో పనిచేసి బదిలీపై కర్నూలు వచ్చాను. 2017లో హైదరాబాదులో పని చేసే సందర్భంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొందాను.

పిఎఫ్ ఖాతాదారులకు పెన్షన్ ఏ తేదీ లోపల ఇస్తారు?

ఎసి: ప్రతినెల 10వ తేదీలోపు అందజేస్తాం.

పిఎఫ్ ఖాతాదారులకు ఏ విధంగా చేరువవుతున్నారు?

ఎసి: 'నిధి ఆప్కే నికట్' అనే కార్యక్రమం ద్వారా మీ ఇంటి ముంగిటికే పిఎఫ్ కార్యాలయం. అనే కార్యక్రమం ద్వారా ప్రతినెల ఒక ప్రాంతంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి ఖాతాదారుల నుండి వినతులు స్వీకరిస్తాం. కొన్ని అక్కడికక్కడే సమస్యలు పరిష్కారం చేస్తాం. మరికొన్ని కడప కార్యాలయానికి పంపి వాటి పరిష్కారానికి కృషి చేస్తాం. ఈనెల 27న మాంటిసోరి స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

ఖాతాదారుల నుండి ఎన్ని దరఖాస్తులు స్వీకరించారు? ఎన్ని పరిష్కరించారు?

ఎసి: కర్నూలు, నంద్యాల ఉభయ జిల్లాలలో 2023 జనవరి నుండి 92 దరఖాస్తులు ఖాతాదారుల నుండి స్వీకరించాం. అందులో 25 పరిష్కరించాం.

ఉభయ జిల్లాల్లో స్థాపించిన కంపెనీలు ఎన్ని? ఎన్ని ఖాతాలు ఉన్నాయి? ఎన్ని పెన్షన్లు ఉన్నాయి?

ఎసి: ఉభయ జిల్లాలలో 2065 కంపెనీలు స్థాపించబడ్డాయి. అందులో ఒక లక్ష 40 వేల ఖాతాలు ఉన్నాయి. 15వేల దాకా పెన్షనర్లు ఉన్నారు.



పిఎఫ్ ఖాతాలు తెరిచేందుకు నిబంధనలు ఏమిటి?

ఎసి: పిఎఫ్ ఖాతాలు తెరవాలంటే ఆసుపత్రి, కార్ఖానాలలో, పాఠశాలల్లో, వైద్యశాలల్లో తదితర సంస్థలలో కనీసం 20 మంది, సినిమా థియేటర్లలో కనీసం ఐదు మంది ఉంటే పిఎఫ్ సౌకర్యం కల్పిస్తాం.

పిఎఫ్ ఖాతాదారులు జీవన్ ప్రమాణ పత్రాలు ప్రతి సంవత్సరం ఏ నెల లోపు సమర్పించాలి?

ఎసి: పిఎఫ్ ఖాతాలో కలిగిన పెన్షన్ దారులు తాము జీవించి ఉన్నామని జీవన్ ప్రమాణ పత్రాన్ని నవంబరు నెలాఖరు లోపల సమర్పించాలి. మరో మూడు నెలల లోపల పిపిఒ నెంబర్ చెప్పి రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఉద్యోగి పీఎఫ్ ఖాతాదారుడు అయి అకాల మరణం చెందితే పెన్షన్ ఎవరెవరికి వస్తుంది?

ఎసి: ఉద్యోగి పిఎఫ్ ఖాతాదారుడై అకాల మరణం చెందితే సంబంధిత ఫారాలు భర్తీ చేసి పిఎఫ్ కార్యాలయానికి అందజేస్తే భార్యకు రూ.1000 చొప్పున జీవితాంతం పెన్షన్ ఇస్తాం. చిన్న పిల్లలు ఉన్నట్లయితే వారికి 25 సంవత్సరాల వయసు వరకు ఒక్కొక్కరికి రూ.450 చొప్పున ఇద్దరికీ రూ.900 ఇస్తారు.

ఉద్యోగి జీతం బేసిక్ ఎంత లోపు ఉంటే పిఎఫ్ కు అర్హుడు?

ఎసి: ఉద్యోగికి జీతం రూ 15,000 బేసిక్ లోపు ఉంటే పిఎఫ్ పొందుటకు అర్హుడు. పిఎఫ్ ఖాతాదారుడు వాటా 12 శాతం, సంస్థ వాటా 12 శాతం కలిపి ప్రభుత్వానికి సంస్థ చెల్లించాల్సి ఉంటుంది. పెన్షన్ కు 1.16శాతం కేంద్రంఇస్తుంది. 8.33శాతం పెన్షన్ కు 3.67 పిఎఫ్ కు పోతుంది. దానికి 8.1శాతం వడ్డీ జమ అవుతుంది.

పిఎఫ్ ఖాతాదారులు సమస్యల పరిష్కారానికి ఎవరిని సంప్రదించాలి?

ఎసి: పిఎఫ్ ఖాతాదారులు పిఎఫ్ కార్యాలయంలో గాని, ఫోన్. 08562 - 244902, 244189. వాట్సాప్ నెంబర్. 949 1138297. లకు కానీ సంప్రదించాలి.



నేడు స్పందన కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టర్

నేడు స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీశైలంలో రాష్ట్ర గవర్నర్ పర్యటనను పురస్కరించుకుని స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రం మినహా మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో యథాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు పోలీసు స్పందన తాత్కాలిక రద్దు

నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో నేడు జరగాల్సిన పోలీసు స్పందన కార్యక్రమం అనివార్య కారణాల వల్ల తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు గమనించి రావొద్దని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : సిఐ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని కొండపేటలో ఈ నెల 21, 22న దేవర కార్యక్రమానికి వచ్చే వాహనదారులు, అతిధులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సిఐ సుబ్బారాయుడు, ఎస్సై రామిరెడ్డిలు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ దేవరకు సంబంధించి ఎవరూ పట్టణంలో రాజకీయ పోస్టర్లు, బ్యానర్లు కట్టరాదని తెలిపారు. ఏ రాజకీయ పార్టీ నాయకుని ఫొటోలతో బ్యానర్లు, పోస్టర్లు కట్టరాదన్నారు. పెద్దమ్మ తల్లి దేవరకు వచ్చే భక్తులకు ఆహ్వానమని అమ్మ వారి ఫోటో మాత్రమే ఉండాలని తెలిపారు. వీధులలో ఎవరూ కూడా రోడ్డుకు అడ్డంగా వాహనాలు ఉంచరాదని తెలిపారు. ఈ నెల 22వ తేదీ ఉదయం 6 నుండి సాయంత్రం 6 వరకు సిమెంట్ లారీ లు, పెద్ద ట్యాంకర్లు పట్టణంలోకి అనుమతించబడవని తెలిపారు. వాహనాలను రోడ్డుమీద పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని సూచించారు.

ప్రతి ఒక్కరినీ ప్రేమించడంలోనే సంతోషం

- సిఎస్ఐ నంద్యాల డయాసిస్ బిషప్ రెవరెండ్ డాక్టర్ ఎగ్గొని పుష్పలలిత

ప్రజాశక్తి - పాములపాడు

ప్రతి ఒక్కరినీ ప్రేమించడంలోనే సంతోషం ఉందని సిఎస్ఐ నంద్యాల డయాసిస్ బిషప్ రెవరెండ్ డాక్టర్ ఎగ్గొని పుష్పలలిత అన్నారు. ఆదివారం మండలంలోని భానుముక్కల గ్రామంలో సిఎస్ఐ చర్చి ఎక్స్టెన్షన్ (విస్తరణ) పనులను బిషఫ్ రెవరెండ్ డాక్టర్ ఎగ్గొని పుష్పలలిత ప్రార్థన చేసి పునాదిరాయి వేశారు. పనుల శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె సంఘస్థులందరికీ దైవ సందేశాన్ని అందించారు. నేటి సమాజంలో నిండిన స్వార్థాన్ని ఆమె గుర్తు చేస్తూ బావోద్వేగానికి గురయ్యారు. ధనం, సంపద ఏదీ మిగలదని, ప్రేమే శాశ్వతమన్నారు. ఆమె చిన్నారులతో ప్రేమపూర్వకమైన పాటలు పాడించారు. కార్యక్రమంలో నంద్యాల డయాసిస్ కార్యదర్శి స్టాన్లీ విలియమ్స్ డీనరీ చైర్మన్ రెవరెండ్ నల్లమల్ల జాను, పాస్టేట్ చైర్మన్ రెవరెండ్ వేల్పుల ప్రసాదు, డయాసిస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ గడ్డం సత్యరాజు, సంఘ కాపరి గుండం ఎలిసెన్న, సంఘ పెద్దలు గడ్డం మోహన్, గడ్డం విజయుడు, గడ్డం జయరాజు, గుండం భాస్కరు, చింతకుంట ధర్మరాజు, సంఘస్తులు పాల్గొన్నారు

- సిఎస్ఐ చర్చి ఎక్స్టెన్షియల్ పనులను ప్రారంభిస్తున్న బిషప్ ఎగ్గొని పుష్పలలిత



ప్రాథమిక పాఠశాలల విలీనం విరమించుకోవాలి

- యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సుధాకర్

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట ప్రభుత్వం 10 మంది విద్యార్థులలోపు ఉన్న ప్రాథమిక పాఠశాలలను ఒక కిలోమీటర్ పరిధిలోని పాఠశాలలో విలీనం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం యుటిఎఫ్ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు పివి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాల వల్ల రాష్ట్రంలో ప్రాథమిక విద్యా వ్యవస్థ ప్రమాదంలో పడిందని అన్నారు. ప్రాథమిక విద్య పేదలకు దూరం అవుతుందని తెలిపారు. ఇప్పటికే 3,4,5 తరగతులు ఉన్నత పాఠశాలలో విలీనం చేయడం వల్ల ప్రాథమిక పాఠశాలలు బలహీనం అయ్యాయని, రాష్ట్రంలో గత నాలుగేళ్లలో ఒక్క టీచర్ పోస్ట్ కూడా భర్తీ చేయలేదన్నారు. పాఠశాలల విలీనం వల్ల 30 వేల పదోన్నతులు వస్తాయని గొప్పలు చెప్పిన ప్రభుత్వ అధికారులు ఒక్క ప్రమోషన్ కూడా ఇవ్వలేదని విమర్శించారు. ప్రాథమిక పాఠశాలలు బలోపేతం చేసి పేదలకు ప్రభుత్వ విద్య అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటిఎఫ్ మహిళా నాయకురాలు శాంతి ప్రియ, నాయకులు జాకీర్, వివి రామ్మోహన్, సత్య ప్రకాష్, బాబా ఫక్రుద్దీన్, బాలాజీ, కె.రామక్రిష్ణుడు, ఎం.వెంకటేశ్వర్లు, ఫిదా, రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్

టిడిపి అధిష్టానం ఆదేశిస్తే పోటీకి సిద్ధం

- ఆళ్లగడ్డ రాజకీయాల్లో 35 ఏళ్ల అనుభవం : ఏవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

టిడిపి అధిష్టానం ఆదేశిస్తే 2024 శాసనసభ ఎన్నికల్లో పార్టీ తరపున ఆళ్లగడ్డ నుండి పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆ పార్టీ నాయకులు, మాజీ రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంవి నగర్‌లో విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆళ్లగడ్డ తాలూకాలో ఏవి హెల్ప్ లైన్ ద్వారా అనేక సేవ కార్యక్రమాలు చేశామన్నారు. తనకు ప్రజలతో మంచి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పారు. ఆళ్లగడ్డ పట్టణానికి సంబంధించి దిన మార్కెట్ వేలాలకు సంబంధించిన పైకం 25 లక్షల రూపాయలు తన సొంత నిధుల నుండి చెల్లించి చిరు వ్యాపారస్తులకు అండగా నిలిచామని తెలిపారు. టిడిపి అధిష్టానం ఆళ్లగడ్డ తాలూకాలో సర్వే చేస్తోందని, ఎవరికి బాగుంటే వాళ్లకు సీటు ఇస్తుందని, తనకు బాగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాలూకాలో తనకు ప్రజాభిమానం బాగా ఉందని, తాను ఇక్కడే పుట్టి పెరిగానని, ప్రజలతో మంచి సంబంధాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఆళ్లగడ్డతో 35 సంవత్సరాల అనుబంధం ఉందని, గ్రామస్థాయి నుండి తాలూకా స్థాయి వరకు అందరూ నాకు బాగా తెలుసునని అధిష్టానం తనకు సీటు ఇస్తే ఆళ్లగడ్డ నుండి భారీ మెజారిటీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. అధిష్టానం నిర్ణయమే తనకు శిరోధార్యమని అన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఏవి సుబ్బారెడ్డి

విస్తృతంగా రెడ్ క్రాస్ సొసైటీ సేవలు : చైర్మన్

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైద్య సేవలను ఇంకా విస్తృతం చేస్తామని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ దస్తగిరి పర్ల తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఓంకార పుణ్యక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ వైద్యులు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ మండల అధ్యక్షులు ఎండి షరీఫ్, డాక్టర్ శ్రీనివాసులు, మోహన్, భరత్, మహిళా విభాగం నాయకురాలు డాక్టర్ హలీమా పాల్గొన్నారు. **మహానంది :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శ్రీశైలంలో (మూడు చోట్లు), మహానంది, ఓంకారం, యాగంటి , భోగేశ్వరంలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు రేపు సాయంత్రంతో ముగుస్తున్నాయని రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల తెలిపారు. మహానందిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు.

భక్తులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం





విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు

ఘనంగా ఎంవి నగర్ స్థలదాతల విగ్రహావిష్కరణ

- పాల్గొన్న పొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఇరిగెల సోదరులు, ఏవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని ఎంవి నగర్‌లో ఆదివారం ఎంవి నగర్ స్థలదాతలైన స్వర్గీయ గంగవరం లక్ష్మమ్మ, గంగవరం వెంగళరెడ్డి విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది. ఎంవి నగర్ సొసైటీ అధ్యక్షులు ఆదిత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, వైసిపి ఆళ్లగడ్డ తాలూకా నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి, ఇరిగెల రామచంద్రారెడ్డి, సర్పంచి ఇరిగెల విశ్వనాథరెడ్డి, ఇరిగెల ప్రతాప్ రెడ్డిలు, టిడిపి నాయకులు మాజీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి తో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్యనారాయణ రెడ్డి, హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీనాథ్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంవి నగర్ సొసైటీ అధ్యక్షులు ఆదిత్య చంద్రారెడ్డి మాట్లాడుతూ 1954లో గవర్నర్ త్రివేది జ్ఞాపకార్థం ఎంవినగర్ సహకార గృహ నిర్మాణ సొసైటీ మా తాత మల్లారెడ్డి పేరు మీద శ్రీకారం చుట్టారన్నారు. మా తల్లిదండ్రులు గంగవరం లక్ష్మమ్మ, గంగవరం వెంగళరెడ్డి ఎంవి నగర్‌కు స్థలాన్ని దానం చేశారని, వారి జ్ఞాపకార్థంగా విగ్రహాలను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఎంవి నగర్ అభివృద్ధికి సొసైటీ అధ్యక్షునిగా తన వంతు కృషి చేస్తానన్నారు. అలాగే డిఎస్పి, అగ్నిమాపక శాఖ, ఎంపీడీవో, సబ్ రిజిస్టర్, ఇరిగేషన్, అగ్రికల్చర్‌తో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు 12 ఎకరాలను తమ పెద్దలు స్థలం కేటాయించారని తెలిపారు. రానున్న రోజుల్లో ఎంవి నగర్‌ను అన్ని హంగులతో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

రేషన్‌కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో ఉన్న రేషన్‌కార్డుదారులందరికీ ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి రుసుము చెల్లించకుండా ఉచితంగా బియ్యాన్ని పొందాల్సిందిగా ఆమె సూచించారు.

చెంచు గిరిజన గ్రామాల్లో నీటి సదుపాయం కల్పించండి

ప్రజాశక్తి - శ్రీశైలం

చెంచు గిరిజన గ్రామాల్లో మంచినీటి సదుపాయం, చెంచులు ఉన్న ఇండ్లకు మరమ్మతులు చేయించాలని, కొత్త ఇండ్ల నిర్మాణం చేపట్టాలని కొమరం భీమ్ ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు వై.ఆశీర్వాదం అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రకాశం జిల్లా దోర్నాల మండలం పెద్దారుట్ల చెంచులు దాదాపు రెండు కిలోమీటర్ల దూరం అడవిలోకి వెళ్లి ఊట నీరు తెచ్చుకుంటున్న పరిస్థితి ఏర్పడిందని అన్నారు. హఠకేశ్వరం చెంచుగూడెంలో మోటార్ చెడిపోవడంతో నీళ్లు రాక చెంచు గిరిజనులు పాలధార నుండి నీళ్లు తెచ్చుకుంటున్నారని తెలిపారు. తక్షణమే మోటార్ రిపేర్ చేయించాలని, ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని చెంచు గిరిజన గ్రామాల్లో మంచినీటి బోర్లను మరమ్మతులు చేయించాలని, వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని, నీటి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కుడుముల వెంకటేశ్వర్లు, వీరయ్య, భ్రమరాంబ, అల్లూరి సీతారామరాజు చెంచు గిరిజన సంక్షేమ సంఘం దోర్నాల మండల అధ్యక్షుడు దంసాని వెంకటేశం, నగేష్, వీరయ్య చెంచు గిరిజనులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమార్తె మృతి

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మండల పరిధిలోని నల్లమల్ల అడవిలో రోళ్లపెంట సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకుమార్తె మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు... పాములపాడు మండలం ఇస్కాల గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు ద్విచక్ర వాహనంపై దోర్నాల వైపు వెళుతుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో తల్లి, కూతురు మృతి చెందారు. తండ్రి, మరో కూతురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సంఘటన జరిగిన తర్వాత ఈ ప్రాంతంలో వస్తున్న వాహనాదారులు ఎవరు కూడా స్పందించకుండా వెళ్లిపోవడం అమానవీయం. ఇదే మార్గంలో ఎమ్మిగనూరు చెందిన పాత్రికేయుడు శ్రీనివాస్ నాయుడు కారులో వస్తుండగా ఘటనను చూసి గాయపడ్డ వారిని, మృతి చెందిన వారిని తన కారులో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు చేర్చినట్లు తెలిసింది. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

క్రీడలను ప్రోత్సహించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - ఆత్మకూర్

క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాలని ఎస్సై కృష్ణమూర్తి అన్నారు. జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు స్థానిక ఇండోర్ స్టేడియంలో జరిగాయి. ఆదివారం ముగింపు కార్యక్రమానికి ఎస్ఐ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తే వారు ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది సుధాకర్ రెడ్డి, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



గెలుపొందిన బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఆత్మకూరు ఎస్సై కృష్ణమూర్తి

వైభవంగా ఉమామహేశ్వర కళ్యాణోత్సవం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి ఉమా మహేశ్వర స్వామి దేవస్థానంలో ఉమామహేశ్వరుల కళ్యాణం ఆదివారం తెల్లవారుజామున రమణీయంగా జరిగింది. కళ్యాణ మహోత్సవంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆయన సతీమణి కాటసాని జయమ్మ, వీరి కుమారుడు కాటసాని ఓబుల్ రెడ్డిలు పాల్గొన్నారు. ముందుగా ఉమా మహేశ్వరులకు బనగానపల్లె ఎమ్మెల్యే దంపతులు, కుమారుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి లింగోద్భవం అనంతరం స్వామి వారి కళ్యాణం మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సాయంత్రం నాలుగు గంటలకు నందికోల మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులకు ఆలయ చైర్మన్ తోట బుచ్చి రెడ్డి ,ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్ర శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక వసతులను కల్పించారు. రేలారే రేల, జబర్దస్త్ కార్యక్రమాలతో పాటు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు దేవస్థానం వారు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా సిఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఎస్సైలు రామిరెడ్డి రామాంజనేయరెడ్డి జగదీశ్వర రెడ్డి రాకేష్‌లు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. భక్తులకు ఉమామహేశ్వర నిత్య అన్నదాన సంస్థ , ఈ ఉమామహేశ్వర రైతు అన్నదాన సత్రం, ఆర్యవైశ్య నిత్య అన్నదాన సత్రం బ్రాహ్మణ అన్నదాన సత్రం యాదవ అన్నదాన సత్రాలలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో యాగంటి దేవస్థానం మాజీ చైర్మన్ దొనపాటి యాగంటి రెడ్డి, ఉమామహేశ్వర నిత్య అన్నదాన సంస్థ కార్యదర్శి దస్తగిరి రెడ్డి, దేవస్థానం పాలకమండలి సభ్యులు బింగిమళ్ళ హనుమాన్ శెట్టి, యామా చిన్న పుల్లారెడ్డి, సంగు రామసుబ్బారెడ్డి, వైసిపి నాయకులు మీరాపురం మనోహర్ రెడ్డి, పాతపాడు వెంకటేశ్వర రెడ్డి, జోలాపురం తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఉమామహేశ్వరులకు కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు

యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ప్యాపిలి

డోన్ పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన ప్యాపిలి మండల శాఖ కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గానికి ఎన్నికల అధికారిగా జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్ ఎస్ బాబు, ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి వ్యవహరించారు. నూతన మండల గౌరవాధ్యక్షులుగా శేషయ్య, అధ్యక్షులుగా బొజ్జన్న, సహాధ్యక్షులుగా వెంకట మోహన్, వాసవి, ప్రధాన కార్యదర్శిగా నరసింహారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా రాజేంద్ర, మండల కార్యదర్శులుగా రాజన్న, సుమన్, మధు, జయ గోపాల్, అంబేద్కర్, అంజనయ్య, శాంతి ప్రియ, లక్ష్మీ నారాయణమ్మ, గోపాలకృష్ణ, లక్ష్మీ ఈశ్వరమ్మ, శివ కేశవులు, కంబగిరి, వేణు మాధవ, జిల్లా కౌన్సిలర్లుగా రమేష్ నాయుడు, రఘు నాయక్, హుస్సేన్ బాషా, సర్వజ్ఞ మూర్తి, చంద్ర మోహన్, అనురాధ, నాగమణి, అంజనప్పలను ఎన్నుకున్నారు. సమావేశంలో జెవివి జిల్లా కార్యదర్శి శాంతి ప్రియ, డోన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామ్మూర్తి, ప్రసాద్ రెడ్డి, శాంతి కుమార్, ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, శాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.





పోతుల నాగరాజుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పోతుల నాగరాజును గెలిపించండి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజును గెలిపించాలని కోరుతూ ఆదివారం మండలంలోని సింగవరం గ్రామంలో ప్రజా సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కమిటీ కన్వీనర్ రత్నమయ్య, సిఐటియు మండల నాయకులు రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రామచంద్రుడు తదితరులు సింగవరం గ్రామంలో పట్టభద్రులను కలిసి పోతుల నాగరాజును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్యాపిలి :** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజు, కత్తి నరసింహా రెడ్డిలను గెలిపించాలని యుటిఎఫ్ రాష్ట్ర మాజీ గౌరవాధ్యక్షులు నరసింహుడు కోరారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా యుటిఎఫ్ ప్యాపిలి మండల శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మార్చిలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

నేటి బిజినేములలో కాశీ చంద్రమౌళీశ్వర స్వామి ఉత్సవాలు

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు మండలం బిజినవేముల గ్రామంలో వెలిసిన కాశీ చంద్రమౌళీశ్వర స్వామి ఉత్సవాలు నేటి నుంచి 22వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాలు కొణిదెల, నాగటూరు, మల్యాల, నందికొట్కూరు, మద్దిగట్ల ప్రజలు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉత్సవాలను ప్రధాన అర్చకులు వీరేష్ యాదవ్, గ్రామ సర్పంచి రవి యాదవ్, కమిటీ సభ్యులు జి.మధు యాదవ్, కిరణ్ రెడ్డిల ఆధ్వర్యంలో జరుగనున్నాయి. అర్బన్ సిఐ విజయ భాస్కర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

రసవత్తరంగా పొట్టేళ్ల పోటీలు : మండలంలోని బిజినవేముల గ్రామంలో కాశీ చంద్రమౌళీశ్వర ఉత్సవాల వేడుకల సందర్భంగా ఆదివారం పొట్టేళ్ల పోటీలు రసవత్తరంగా జరిగాయి. సర్పంచి రవి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 50 పొట్టేలు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి ఎంబాయ్ చెందిన రమేష్ పొటేలు రూ.10వేలు, రెండవ స్థానం గడివేముల అంజి పొట్టేలు రూ.8వేలు, మూడవ స్థానం నాగటూరు వెంకటరమణ పొట్టేలు రూ.6 వేలు, నాలుగో స్థానం లక్ష్మాపురం చందు పొట్టేలు రూ.4 వేలు అందుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి, సీఐ విజయ భాస్కరు, ఎస్సై ఎన్వి రమణ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సురేష్ యాదవ్, అమర్నాథ్ యాదవ్, రబ్బాని, రమణ గౌడ్, వెంకటరమణ, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

అప్పులబాధ తాళలేక బంగారం వ్యాపారి ఆత్మహత్య

ప్రజాశక్తి - నందికొట్కూరు

అప్పుల బాధ తట్టుకోలేక బంగారం వ్యాపారి ఉస్మాన్ బాష (36) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నందికొట్కూరు పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు.. నందికొట్కూరుకి చెందిన ఇస్మాయిల్ కుమారుడు ఉస్మాన్ బాష గత కొంతకాలంగా పట్టణంలో బంగారం దుకాణం నిర్వహిస్తున్నాడు. బైరెడ్డి కాంప్లెక్స్‌లో సొంతగా వ్యాపారం నిర్వహించేవాడు. ఇతని భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. బంగారం వ్యాపారం కోసం అప్పులు చేశాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పులు ఎలా చెల్లించాలని తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఆదివారం బంగారం దుకాణంలో సైనేడు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొందరు వ్యాపారులు గమనించి చికిత్స కోసం హుటాహుటిన ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. మృతుడి భార్య షమీన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్వీ రమణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్రస్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు

- మహానందిలో ప్రారంభించిన ఎమ్మెల్యే శిల్పా

ప్రజాశక్తి - మహానంది

మహానందిలో మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకొని అఖిల భారత ఒంగోలు జాతిఎడ్ల బల ప్రదర్శన పోటీలను శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను కూడా రైతు కుటుంబం నుంచే వచ్చానని, రైతుల కష్టాలు ఏమిటో తనకి తెలుసన్నారు. రైతులను ప్రోత్సహించేలా ఎడ్ల పోటీలు నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. **కొలిమిగుండ్ల :** మండలంలోని పెట్నికోట–నాయనిపల్లి గ్రామాల మధ్యన వెలసిన ప్రసన్న పార్వతీ సమేత గుండు మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగంలో రాష్ట్రస్థాయి పాలు పండ్ల క్యాటగిరి ఎద్దుల బల ప్రదర్శన పోటీలను ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి, కాటసాని ప్రసాద్ రెడ్డి, పేరం సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** మహాశివరాత్రి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలైన ఓంకార సిద్దేశ్వర స్వామి, శివ నందీశ్వర, కృష్ణ నందీశ్వర దేవస్థానంలో ఎద్దుల బల ప్రదర్శన పోటీలు రెండవ రోజు హోరాహోరీగా జరిగాయి. కృష్ణ నంది దేవస్థానంలో వెంగళ్రెడ్డిపేట సర్పంచ్ పల్లె నాగమణి, వైసిపి నాయకులు పల్లె సోమశేఖర్ రెడ్డి, భూమా దక్షిణేశ్వర్ రెడ్డి, అంబటి బాలేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పోటీలను ప్రారంభించారు. శివ నందీశ్వర దేవాలయంలో మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు రాగాల వెంకటరమణ, వైసిపి నాయకులు బాబులు వెంకటేశ్వర్లు, ఆలయ చైర్మన్ మండల నాయుడు ఆధ్వర్యంలో, ఓంకార పుణ్యక్షేత్రంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చిన్న సంజీవరెడ్డి పోటీలను ప్రారంభించారు. సీనియర్ విభాగం పోటీలు నేడు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయని నిర్వహణ కమిటీ తెలిపారు. ఎద్దుల బల ప్రదర్శన పోటీలను ప్రారంభించేందుకు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి హాజరవుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



మహానందిలో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



కొలిమిగుండ్ల : ప్రారంభిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్



బండి ఆత్మకూరు : పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు



ముమ్మరంగా రోడ్డు పనులు

ప్రజాశక్తి - బేతంచర్ల

మండలంలోని కనుమ కింది కొట్టాల గ్రామానికి, కనుమ కింది కొట్టాల నుండి బనగానపల్లె మండలం రామకృష్ణాపురం గ్రామం వరకు రోడ్డు, కల్వర్టులు దాదాపు మూడున్నర కిలోమీటర్ల బిటి రోడ్డు రహదారి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దాదాపు నాలుగు దశాబ్దాల కాలంగా కనుమ కింది కొట్టాల గ్రామానికి సరైన దారి లేక ఆ గ్రామానికి వెళ్లాలన్నా, బేతంచర్లకు, ఇతర గ్రామాలకు రావాలన్నా ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో దాదాపు 5 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించి రహదారి పనులు చేపట్టారు. త్వరలో గ్రామ ప్రజల రహదారి ఇబ్బందులు తొలగనున్నాయి. రహదారి పనులతో పాటు వర్షాలు వచ్చినా ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఐదు కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నట్లు మండల పంచాయతీ రాజ్ ఇంజనీర్ గణేష్ కుమార్ తెలిపారు.

ఎపి గవర్నర్‌గా అబ్దుల్ నజీర్ నియామకం రాజ్యాంగ విరుద్ధం : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - డోన్

ఎపి గవర్నర్‌గా అబ్దుల్ నజీర్ నియామకం రాజ్యాంగ విరుద్ధమని ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు కె.రంగనాయకులు పేర్కొన్నారు. ఆదివారం డోన్ పట్టణంలోని ఐఎఫ్‌టియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల 12 మంది గవర్నర్‌ల స్థానాలను మార్పులు చేర్పులు చేసిందని, ఈ ప్రక్రియలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అబ్దుల్ నజీర్‌ని ఎపి గవర్నర్‌గా నియమించిందని, ఈ నియామకంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా ఆనైతికతను ప్రదర్శించిందని విమర్శించారు. జడ్జిలు రిటైర్డు అయిన తర్వాత కనీసం ఒక సంవత్సరం పాటు రాజ్యాంగ పదవులు కట్టబెట్టరాదని నిబంధనలు ఉన్నాయని తెలిపారు. అయినా 2023 జనవరి 23న రిటైర్ అయిన సుప్రీంకోర్టు జడ్జి అబ్దుల్ నజీర్‌ను ఎపి గవర్నర్‌గా బిజెపి కేంద్ర ప్రభుత్వం నియమించిందని చెప్పారు. అబ్దుల్ నజీర్‌ని ఒక మేధావిగానో లేక మైనార్టీ వర్గానికి ప్రాతినిధ్యం వహించే వారిగాను లేదా బిజెపి సానుభూతి పరులుగాను పరిగణించి ఈ పదవి ఇవ్వలేదని, ఆయనకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి మధ్య జరిగిన క్విడ్ ప్రోకో ఒప్పందంలో భాగంగా ఈ రాజ్యాంగ పదవి దక్కిందని అనేక మంది విశ్లేషకులు చెబుతున్నారని తెలిపారు. బాబ్రీ మసీదు అయోధ్య భూ వివాదం కేసుల్లో బిజెపి కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన ఫలితమే ఈ రాజ్యాంగ పదవి అని, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు అబ్దుల్ నజీర్‌ని అనుకూలంగా తీర్పు ఇవ్వమని కేంద్రం ఒప్పందం చేసుకొని ఈ పదవి ఇచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి దిక్కుమాలిన చర్యలకు పాల్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు డివిజన్ కార్యదర్శి మాదులు, వెంకప్ప, మునీంద్ర, రమేష్, మల్లికార్జున, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కమణీయం స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం

ప్రజాశక్తి - మహానంది

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహానంది పుణ్యక్షేత్రంలో స్వామి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో భక్తులు లక్షలాది సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం రాత్రి క్షేత్రంలో లింగోద్భవ కాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, విశేష వేదమంత్రాలతో నిర్వహించారు. అనంతరం ఆదివారం తెల్లవారుజామున స్వామి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం లక్షలాది భక్తుల నడుమ వేద పండితుల వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. శివరాత్రి జాగరణ లో భక్తులు లక్షలాది సంఖ్యలో సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం స్వామి సింహ వాహన సేవతో ఆలయ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి 7 గంటల తర్వాత స్వామి అమ్మవార్లు పుష్ప పల్లకి సేవా కార్యక్రమంలో భక్తులకు దర్శనమిచ్చారు. **చాగలమర్రి :** చాగలమర్రి పట్టణంలోని రామలింగేశ్వర ఆలయంలో ఆదివారం తెల్లవారు జామున శివపార్వతుల కల్యాణం ఆలయ అధ్యక్షులు దుర్గం రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఉభయదారులచే కమనీయంగా సాగింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాసులు, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. **పాణ్యం :** మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం కొత్తూరు సుబ్బారాయుడు స్వామి సన్నిధిలో నాగలింగేస్వర స్వామి కళ్యాణం ఘనంగా జరిగింది. ఆలయ ఇఒ రామకృష్ణ ఆదేశాల మేరకు సర్పంచి ఆధ్వర్యంలో అభిషేకాలు, కళ్యాణం నిర్వహించారు. దేవస్థానం సిబ్బంది సుబ్బారెడ్డి పాల్గొన్నారు. **కొత్తపల్లి :** సప్త నదుల సంఘమతీరంలో వెలసిన సంగమేశ్వరుని కళ్యాణం ఆదివారం ఆలయ పురోహితులు తెలకపల్లి రఘు రామ శర్మ ఆధ్వర్యంలో కమనీయంగా జరిగింది. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు వేప దారు శివలింగాన్ని దర్శించుకున్నారు. కళ్యాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు కాశిరెడ్డి నాయన ఉచిత అన్నదాన సత్రం వారు పలువురు దాతల ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు.





ఇదేం కర్మ కార్యక్రమం నిర్వహిస్తున్న టిడిపి యువ నాయకులు

వైసిపి పాలనకు రోజులు దగ్గరపడ్డాయి : టిడిపి

ప్రజాశక్తి - అవుకు

రాష్ట్రంలో వైసిపి పాలనకు రోజులు దగ్గర పడ్డాయని తెలుగుదేశం పార్టీ యువ నేతలు కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, ఐవి ఉగ్రసేనారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని సింగనపల్లె గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సారి ఎన్నికలలో వైసీపీ పాలనకు చరమగీతం పాడాలన్నారు. తెలుగుదేశం పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు గాలి సాంబశివారెడ్డి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** నందికొట్కూరు పట్టణంలోని 22వ వార్డులో టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ లాయర్ జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను వారు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికలలో టిడిపిని గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. వార్డు ఇంచార్జ్ కళాకర్, అప్సర్ భాష , గోవర్ధనగిరి, కృష్ణారెడ్డి, అయ్య రాజు, ప్రేమ్, వంశీ, ప్రకాష్, శరత్, రాజేష్, సత్యరాజు పాల్గొన్నారు.

తారకరత్న మృతి బాధాకరం : టిడిపి

ప్రజాశక్తి - పాణ్యం

నందమూరి తారకరత్న మృతి బాధాకరమని టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పాణ్యంలోని టిడిపి మండల కార్యాలయంలో నాయకులు తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి లాయర్ బాబు, జిల్లా కార్యదర్శి రమణ మూర్తి, ఎంపిటిసి రంగ రమేష్, జిల్లా మైనార్టీ నాయకులు ఖాదర్ బాషా, రాష్ట్ర వాల్మీకి బోయ సాధికార సమితి సభ్యులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** నందమూరి వంశంలో మంచి నటుడు నందమూరి తారకరత్న కోల్పోయామని ఎన్టీఆర్ అభిమానుల సంఘం అధ్యక్షులు పవన్ యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలో ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నందమూరి అభిమానులు చైనా మాబు, స్టోర్ కాసిం, ఖాజా, సుబ్రహ్మణ్యం ,బషీర్, ఖాజా హుస్సేన్, లక్ష్మన్న, ఆబిక్ హుస్సేన్, నాసిర్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** నందమూరి తారకరత్న మృతిపై టిడిపి మండల అధ్యక్షులు మూలే రామేశ్వర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. **బేతంచెర్ల :** నందమూరి తారక రత్న మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, రేగటి భీమారెడ్డి అన్నారు. బేతంచెర్లలోని టిడిపి కార్యాలయంలో తారకరత్న చిత్రపటానికి నాయకులు కాకర్ల తిరుమలేశ్ చౌదరి, రమేష్ రెడ్డి, జవ్వాజి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మధు, లోకేశ్వర్ రెడ్డి, రమేష్, టైలర్ రాముడు, కుమ్మరి శ్రీనివాసులు, రామాంజనేయులు, నంద్యాల మధు లోకేష్ గౌడ్, చింతకాయల విజయ్ కుమార్, ఆవుల రామకృష్ణ, సెటిల్మెంట్ శెట్టి, కానాల అంజి, తిమ్మరాజు, తిరుపాలు మాధవ్, రామ్మూర్తి, రమేష్, వంశి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న గ్రామస్తులు

జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేత శకునాల జట్టు

ప్రజాశక్తి - పగిడ్యాల

శివరాత్రి పండగను పురస్కరించుకుని యాదవ, కుర్వ సంఘం ఆధ్వర్యంలో పగిడ్యాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. శకునాల గ్రామ జట్టు విజేతగా నిలిచి రూ. 12 వేలు కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో మిట్టకందాల జట్టు రూ. 10 వేలు, మూడవ స్థానంలో దామగట్ల జట్టు రూ. 8 వేలు, నాల్గవ స్థానంలో ప్రాతకోట జట్టు రూ. 5 వేలు అందుకున్నాయి. గ్రామ పెద్దలు బహుమతులు ప్రదానం చేశారు.

ఆర్.నాగులవరంలో పారువేట ఉత్సవాలు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఆర్.నాగులవరం గ్రామానికి అహోబిల లక్ష్మీనరసింహస్వామి పారువేట పల్లకి ఆదివారం చేరుకుంది. ఆయా తెలుపులపై కొలువుదీరగా భక్తులు పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, గ్రామ సర్పంచి గంధం సావిత్రమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

మండలంలోని పలుకూరు గ్రామంలోని రామేశ్వరదేవాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. శివ పార్వతుల ప్రతిమలను కర్ణాటక రాష్ట్రం మంగళూరు నుండి వచ్చిన డప్పు కళాకారుల బృందంతో పల్లకిరథంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అంబాల హుసేన్ రెడ్డి, మాజి ఎంపీపీ అంబాల రామకృష్ణా రెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహక ధర్మకర్త చల్లా మద్దిలేటి, ఆలయ కమిటీ సభ్యులు, పురప్రముఖులు, శంకర్, చిన్నయ్య, అంకన్న, వడ్డెర సంఘం ముఖ్యులు పాల్గొన్నారు.

సంగమేశ్వర ఆలయ హుండీ కానుకలు లెక్కింపు

ప్రజాశక్తి - కొత్తపల్లి

సప్త నదుల సంఘమ క్షేత్రంలో వెలసిన సంగమేశ్వరాలయం హుండీ కానుకలను ఈవో మోహన్, ఎర్రమఠం సర్పంచ్ బాల ఎల్లయ్య, గ్రామస్తులు జనార్దన్ రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం లెక్కించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుండీని లెక్కించగా సుమారు 79,582 రూపాయలు నగదు వచ్చిందన్నారు. వీటిని దేవాలయం అవసరాల నిమిత్తం ఖర్చు చేస్తామన్నారు. ఈ ఏడాది సంగమేశ్వరంలో ప్రత్యేకంగా హుండీ లెక్కింపును కొత్తగా చేపట్టడం భక్తులు చర్చించుకోవడం కొసమెరుపుగా మారింది.

ఘనంగా చత్రపతి శివాజీ జయంతి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని సుంకులా పరమేశ్వరి దేవాలయంలో భవసారి క్షత్రియ పెద్దల ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ టి మాధవరెడ్డి, నాగరాజు, ఉమా శంకర్, కొండోజి రావు, సుబ్బారావు, సాంబశివరావు, వరుణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.ఆర్.జగన్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జెకెసి డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు జెకెసి డిపార్ట్మెంట్ ఉమా శంకర్ ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **చాగలమర్రి :** పట్టణంలోని శివరామానందస్వామి ఆశ్రమంలో మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా గాంధీ సెంటరుకు చేరుకుని అక్కడ శివాజీ జీవితంపై ప్రసంగించారు. వేదచైతన్య స్వామి, హిందూ ఐక్య సంఘ సభ్యులు జయదేవ్ రెడ్డి, సల్లానాగరాజు, ఆవుల నరసింహ ప్రతాప్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** బేతంచర్లలోని స్థానిక అమ్మవారి శాల నుండి పట్టణ పురవీధుల గుండా చత్రపతి శివాజీ చిత్రపటంతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. బుగ్గన చంద్రమౌళీశ్వర్ రెడ్డి, నాగ మోహన్ రెడ్డి, శ్రీనివాసులు, భాస్కర్, రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అహోబిల బ్రహ్మోత్సవాలకు పందిరి పూజ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ వైష్ణవి క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఈ నెల 26 నుండి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం పందిరి పూజ కార్యక్రమం నిర్వహించారు. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవన్ శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి ఆధ్వర్యంలో ఎగువ, దిగువ అహోబిలాల్లో పందిరి పూజకు శ్రీకారం చుట్టారు. పొడవాటి కర్ర తీసుకొని కంకణ ధారణ చేయించి వేదమంత్రాల మధ్య ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, అర్చక బృందం పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు ముందుగా ఎగువ, దిగువ అహోబిలాల్లో తాత్కాలిక మండపాలైన పందిర్లు నిర్మించేందుకు ఈ పందిరి పూజ చేశామన్నారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ శ్రీనివాసన్‌తో పాటు మనియార్ సౌమ్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.



పందిరి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

రసవత్తరంగా పొట్టేళ్ల పోటీలు

- విజేతగా మండ్లం పొట్టేలు

ప్రజాశక్తి - పగిడ్యాల : శివరాత్రి పండగ సందర్భంగా పగిడ్యాలలో ఆదివారం నిర్వహించిన పొట్టేళ్ల పోటీలు రసవత్తరంగా సాగాయి. మండ్లం గ్రామానికి చెందిన ఖాదర్‌భాషా పొట్టేలు మొదటి స్థానంలో నిలిచింది. తిమ్మాపురం హనుమ పొట్టేలు రెండవ స్థానం, చెరుకుచెర్ల వంశీ పొట్టేలు మూడవ స్థానం, నాగటూరు సాయి పొట్టేలు నాల్గవ స్థానంలో నిలిచింది. విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండవ బహుమతి రూ.8 వేలు, మూడవ బహుమతి రూ.5 వేలు, నాల్గవ బహుమతి రూ.3 వేలు పొట్టేళ్ల యజమానులకు పగిడ్యాల సర్పంచు పెరుమాళ్ళ శేషన్న ప్రదానం చేశారు.



బహుమతులు అంద చేస్తున్న సర్పంచు పెరుమాళ్ళ శేషన్న